
# మోటు, వానియొక్క నలుగురు స్నేహితులు

## ముందటి కథ



బాలురు కొంచెము భయపడిరి. అయితే హిమత్‌రాయ్ చూచి చూడనట్లు నటించి నవ్వుచు వెడలిపోయెను. మోటు మరియు నలుగురు బాలురు నది దగ్గరికి వెళ్ళిరి.

మోటువద్ద ఇంద్రజాలపు ఒక ఎర్రపెట్టె యుండెను. బాలురు దానిని తెరువ ఆతురపడుచుండిరి. పెట్టెలో ఏమున్నది?

మరొకసారి తెలిసికొనుడు.








ది తాతా ఆయిల్ మిల్స్

కం॥ లిమిటెడ్.






వ్యాపారస్థులకు

# మా ఉగాది కానుకలు

సరుకులు తక్కువ ధర కిచ్చేస్థలానికే రండి

మరియు వ్యాపారస్థుల మన్నికల ననుసరించి, బైటూరి ఆర్డర్లను నిరంతరం సప్లయి చేయుటకు విశేషంగా నిల్వచేసి వుంచినాము, మా కంపెనీయందు,

| | | | |
|---|---|---|---|
| సన్నరాష్ట్రిం | కస్తూరిపసుపు | వట్టివేరు | పరంగిచెక్క |
| జాజికాయ | మాసుపసుపు | వస | మాపళకాయ |
| జాపత్రి | లవంగపట్ట | అక్కల్‌కారా | కచ్చూరాల్ |
| పిప్పిళ్లు | లవంగాలు | చలవమిరియాలు | మూశాంబరం |
| నేర్వాళం | నాయువులంగ | ఓమం | పాల్‌మడ్డి |
| శొంఠి | అజమోదరం | సాంబ్రాణి | సుగంధవేరు |

ఇల్లాంటివి మావద్ద యితర రకాల మందుల మూలికలు లెక్కలేనన్ని లభించును. లభించు స్థలము :

ఎగుమతి దిగుమతిదారులు :

**D.PEIRIS & CO.,** PHONE: 5196. TEL: REDWOOD

(BRANCH) 24. BADRIAN ST. G.T. MADRAS (TEL: SUMATIPALA)

NO. 8-10. GABO'S LANE, (HO) PETTAH, COLOMBO.

మీ మీ పట్టణములలో త్వరలోనే

# విడుదల అవుతుంది



మీరంతా చూసి ఆనందించండి

శ్రీ వెంకట్రామా పిక్చర్సువారి

# బ్రహ్మరథం

ఆర్టు: కవి: సంగీతం:
శర్మ బలిజేపల్లి మోతీబాబు

నృత్యం: స్టూడియో:
వెంపటి శోభనాచల

★

దర్శకుడు:

## చిత్రపు నారాయణమూర్తి, బి. ఎ.




తారా సందోహం: * అద్దంకి * పారుపల్లి * శ్రీవత్స * రఘురామయ్య
* ఏ. వి. సుబ్బారావు * జియమ్మ * సరోజ
* సౌదామిని * శ్రీరంజని * కుమారి అనసూయ

ఇంకా చాలామంది నటించారు.

---

ఆంధ్ర: పూర్ణా పిక్చర్సు, గాంధీనగర్, బెజవాడ.

రాయలసీమ: మల్లికార్జున పిక్చర్సు, నంద్యాల.

నైజాము: దక్కన్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు, హైద్రాబాద్.

# "బాల" పాతకాపీలు


"బాల" పాతకాపీలు "కావాలి, కావాలి" అని అనేకమంది కోరుతున్నారు. కాని, మావద్ద అన్ని సంచికలూ లేవు. ఈ దిగువ వివరించిన సంచికలు కొద్ది ప్రతులుమాత్రమే వున్నవి. కావలసినవారు వెంటనే వ్రాయండి. వీ. పీ. పద్ధతిలేదు.

| | | | |
|---|---|---|---|
| 1945 | అక్టోబరు | మాస్టర్ పండూ "బాల" | 0- 6-0 |
| ,, | నవంబరు | శ్యామల "బాల" | 0- 6-0 |
| 1946 | జనవరి | సంక్రాంతి సంచిక | 0-12-0 |
| ,, | ఫిబ్రవరి | గాంధీ "బాల" | 0- 6-0 |
| ,, | మే | వంతులాట "బాల" | 0- 6-0 |
| ,, | జూన్ | పిల్లి - ఎలుకా "బాల" | 0- 6-0 |
| ,, | జులై | తాత గుర్రం "బాల" | 0- 6-0 |
| ,, | ఆగస్టు | పుట్టినరోజు సంచిక | 1- 0-0 |
| ,, | సెప్టెంబరు | తెలూను "బాల" | 0- 6-0 |
| ,, | అక్టోబరు | కోడి బండీ "బాల" | 0- 6-0 |
| ,, | నవంబరు | గిరిజ "బాల" | 0- 6-0 |
| | | | 5- 2-0 |
| | | పోస్టేజి (రిజిస్టర్డు) | 0- 6-0 |
| | | మొత్తము | 5- 8-0 |

వెంటనే మనియార్డరు ఈ దిగువ ఎడ్రసుకు పంపండి.

మేనేజరు: "బాల"

నెం. 3 తంబుశెట్టి వీధి, మదరాసు 1.




**'BALA'** CHILDREN'S ILLUSTRATED MONTHLY·

సంపాదకుడు : న్యాయపతి రాఘవరావు బి.ఎ.

సహాయ సంపాదకురాలు : న్యాయపతి కామేశ్వరి, బి.ఎ.ఎల్.టి.

సంపుటి 2 ] ఏప్రిల్ 1947 [ సంచిక 9.

# తెనుగు దేశం

ఈ బాలలోనే ఇంకోచోట ‘‘తెలంగాణాలో కోటిమంది ఆంధ్రులు’’ అన్నరచన పడింది. అది చదివితే నైజాం సంస్థానంలో మన తెలుగువారు పడుతున్న కష్టాలు మీకు తెలుస్తాయి.

అలాగే మన తెలుగుదేశం కొంతభాగం ఒరిస్సా రాష్ట్రంలో కలిసిపోయి, అక్కడ మన తెనుగు వారు చాలా కష్టాలు పడుతున్నారు. మైసూరు రాజ్యంలో కొన్ని భాగాలు తెనుగువారివి. ఈబాలపుట్టిన యీ చెన్నపట్టణం కూడా తెలుగువారిదే. ఇలాగ మన తెలుగుదేశం అంతా ఒక రాష్ట్రంగాలేక ముక్కలు ముక్కలుగా వేరు వేరు రాజ్యాలలోవుంది.

ఈ చెన్నపట్టణంలో చూస్తే మన తెనుగువారు సుమారు అయిదారు లక్షలమందివున్నారు. తెనుగుపిల్లలు చదువుకోవాలంటే అరవంనేర్పే బడులలో చదువుకోవాలి. తెనుగునేర్పేబడులు చాలా తక్కువ. మనరాజ్యం ఇతరులచేతులలో వున్నంతకాలం మనకి ఈ కష్టాలు తప్పవు. చీలిపోయిన మన తెనుగు సీమలన్నీ కలిపి ఒక రాష్ట్రంగా ఏర్పడితే మన దేశం, మనభాష, మన వర్తకం అభివృద్ధిజెంది మనం హాయిగా వుంటాం. తెనుగు బాల బాలిక లందరూ ‘‘మాకు ప్రత్యేక రాష్ట్రం కావాలి’’ అని సభలు చేసి, అలజడి చేయాలి.

మనకి ప్రత్యేకరాష్ట్రంవచ్చిన వరకూ ఊరుకోకూడదు.




# ఉగాది పచ్చడి






పండ్లు పులిసే చింతపండు
వెగటుపుట్టే వేపపూవు
తొగరుమామిడి పిందెతోడను
క్రొత్తబెల్లము కొంత కలిపి
క్రొత్తసంవత్సరపు వేళను
ఆరగించుటయందు చాలా
అర్థమున్నది బాలకా!

★

వేరువేరూ మతములున్నా,
వేషభాషలు వేరుపడినా,
జాతికొక్క నీతియున్నా
భరతపుత్రుల యాశయంబున
భావభేదము లేదటంచును
భావమందున బాలకా!

★

కష్టసుఖములు, కలిమిలేములు
వచ్చుచుండును వానియంతట -
మంచిచెడ్డల కలయికే మరి
మనిషిజీవితమంచు బాగుగ,
భిన్న, భిన్న రుచులుకల్గిన
చిన్నపానీయంబు చాటును
అర్థమెరిగి దాని నీవు
ఆరగింపుము బాలకా!

("నైవేద్యం" నుండి-)

రచన: చె. శ్రీ వెంకటరామయ్య.

# చిట్టి బాలలకు ముద్దు కథ




కాకి డడ్డ తెచ్చు చెట్టు కూచు
నక్క వచ్చి
కాకి బావ పాడు పాడు
కాకి కావు కావు
డడ్డ కింద పప్పో
నక్క తిని పాపో
కాకి యేతూ కూచు.

[ఈ కథ ధవళేశ్వరంలోని దంతుర్తి సూర్యనారాయణ (రెండేండ్లు) చెప్పే విధము. ఇందులో డడ్డ అంటే మాంసపుముక్క అని అర్థము—సం॥]



# చిట్టి మరదలు

రచన:

చిట్టిమరదలు:- పొట్టిబావా ! పొట్టిబావా !
పండక్కి వచ్చావ - పొట్టిబావా !
గుఱ్ఱమెక్కి వచ్చావ - పొట్టిబావా !
గాడిదెక్కి వచ్చావ - పొట్టిబావా !

పొట్టిబావ :- చిట్టిమరదలా ! - చిట్టిమరదలా !
పండక్కి వచ్చానె - చిట్టిమరదలా !
గాడిదెక్కి రాలేదు - చిట్టిమరదలా !
గుఱ్ఱమెక్కి రాలేదు - చిట్టిమరదలా !
రైలెక్కి వచ్చాను - చిట్టిమరదలా !
కారెక్కి వచ్చాను - చిట్టిమరదలా !

మరదలు :- పొట్టిబావా ! - పొట్టిబావా !
టిక్కట్టు కొన్నావ - పొట్టిబావా ?
పరుపుచుట్టలోను దూరి - పొట్టిబావా !
వెరపులేక వచ్చావ పొట్టిబావా ! ॥ పొట్టి ॥



# పొట్టిబావ

‘‘అ న్న య్య’’




పొట్టిబావ

పొట్టిబావ:- చిట్టిమరదలా! - చిట్టిమరదలా!
టిక్కట్టు కొన్నానె - చిట్టిమరదలా!
ఫస్టుక్లాసులోను నేను - చిట్టిమరదలా!
బెస్టుగాను వచ్చానె - చిట్టిమరదలా! ॥ చిట్టి ॥

మరదలు:- పొట్టిబావా! పొట్టిబావా!
నాకేమి తెచ్చావు - పొట్టిబావా!
ఛాక్లెట్లు తెచ్చావ - పొట్టిబావా!
జాకెట్లు తెచ్చావ - పొట్టిబావా!

పొట్టిబావ:- చిట్టిమరదలా! చిట్టిమరదలా!
తెచ్చానె తెచ్చానె - చిట్టిమరదలా!
దాచుంచి తెచ్చానె - చిట్టిమరదలా!
దగ్గరకు - వస్తేయిస్తా - చిట్టిమరదలా!



ఉగాది పండుగకు మా ప్రత్యేక జేజేలు

# రాజా జూకా లోలాకులు

(10 సం॥ గ్యారంటీ)

పిల్లలకు అందము, ఆనందము కలుగజేస్తాయి.
ఆకుపచ్చ, ఎరుపు, సెలులాయిడ్ కలర్సు

**బేబీసైజు జూకాలు**




లోహముపై బంగారురేకును వేడివల్ల అంటించి తయారుచేయబడినది

వి. పి. ఖర్చులు రు. 0-12-0 లు.

ఇంకా ఎన్నో రకరకాల నగలు, గాజులూ ఆవీవున్న
క్యాటలాగు కోసం రాయండి. నేడే ఆర్డరురాయండి,

## రాజా గోల్డ్ కవరింగ్ కంపెనీ,

రాజాబిల్డింగ్సు - రాజుపేట - మచిలీపట్టణము.

## ★ వింత స్నేహితులు ★



అంకెలను గీతలతో కలుపుము బాలా! వింత స్నేహితులను చూడుము బాలా!


## రీటా తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును, సీసా 15అ.

**RITA**

**HAIR TONIC**



# ఇది మీరు విన్నారా?

1. ప్రపంచంలోవున్న అన్ని జంతువులకంటె మిక్కిలి ఎత్తయిన జంతువు జిరాఫి. ఇది ఆఫ్రికాలో వుంటుంది. దీని యెత్తు 19 అడుగులు.

2. ప్రపంచంలో వున్న సినిమాహాలులలో కల్లా పెద్దది అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వుంది. దీనిలో 4,000 మంది కూర్చోవచ్చును.

3. భూమియొక్క వ్యాసం 8,000 మైళ్ళు.

4. సూర్యునియొక్క వ్యాసం 8,64,000 మైళ్ళు, అనగా భూమి వ్యాసమునకు 108 రెట్లు.

5. ప్రపంచంలో పక్షులన్నింటిలో హమ్మింగు అను పక్షి చాలా చిన్నది. ఇది వెనక్కికూడా యెగురుతుంది.

6. ప్రపంచంలో తయారుచేయబడిన అన్ని ఇంగువలకన్నా శ్రేష్టమైనదియు, శాస్త్రయుక్తంగా తయారుచేయబడినదియునగు ఇంగువ **తిలక్ మార్కు** మిక్స్ ఇంగువ. ఇది వాడి తయారుచేయబడిన కూరలు, పచ్చళ్లు, పులుసులు వగైరా చాలా రుచికరముగా నుండును. ఒక పాకెట్ కొని నేడే మీరెందుకు పరీక్షించకూడదు? ఇది అంతటా దొరకును, లేదేని ఈ క్రింది విలాసమునకు వ్రాసి తెప్పించుకొనుడు.

## గోపాల్జీ చాంప్‌షి అండు కో.,

30. గోవిందప్ప నాయక వీధి, జి. టి. మద్రాసు 1.

# నిజమైన సంవత్సరాది


రచన: ధూళిపాళ్ల కృష్ణమూర్తి

సంవత్సరాది పండుగనాడు మనమంతా వేపపువ్వూ, కొత్త బెల్లం, కొత్త చింతపండూ, కొత్తమామిడిముక్కలూ కలిపి సరదాగా తింటాం. మన పెద్దవాళ్లుకూడా దీన్ని తింటారు. ఇంకా పిండివంటలు, పాయసం, ఇలాంటివి అమ్మ తయారుచేస్తే మనం హాయిగా తిని కొత్తబట్టలు కట్టుకునిపండుగ సరదాగా గడుపుతాము.

మనం కడుపునిండా భోంచేసి, ఒంటినిండా గుడ్డకట్టుకోగానే మనదేశంలో ఉండే పిల్లలూ, పెద్దలూ అంతా మనలా ఉంటారని అనుకోవచ్చునా?

మనదేశం ఇంకా దారిద్ర్యంలోనే ఉంది. చాలామందికి కడుపునిండా కూడు; ఒంటినిండా బట్ట దొరకడంలేదు. కారణం? దేశదాస్యం ఇంకా వదలిపోలేదు. సంపూర్ణ స్వాతంత్ర్యం మనకింకా రాలేదు. తెల్లవాళ్లు, వాళ్లసైన్యంతోకూడా, మూటా ముల్లే కట్టుకొని వచ్చేసంవత్సరం జూన్‌లో మనదేశాన్ని వదలిపోతారని మనం వింటున్నాము. తెల్లవాళ్లంతా వెళ్లిపొయ్యాక మనదేశంలో ఉండే ప్రజలంతా హాయిగా దేనికీ లోపంలేకుండా ఉండే దినమే మనకు ఉగాది. అదే నిజమైన సంవత్సరాది పండుగ.

కాలేకడుపుకు చారెడు గంజీ
జారేసిగ్గుకు మూరెడు పాతా
ఎల్లర కందిన చల్లని దినమే
ఉగాది యనుచూ తలపండీ!




కానన్ ష్మిడ్ కు

వేలూరి శివరామశాస్త్రి

అనుసరణం

# వరి యెన్నులు

ఊరి వెలుపల నున్న వరిమళ్ల మీదికి సదానందం తన తండ్రి తో షికారు వెళ్ళాడు. ఆ వరి మళ్ళలో కొంత పైరు నేలమీద పడుకుంది. కొంత పైరు నిటారుగా నిలువబడి ఉంది.

“నాన్నా! తల ఎత్తుకొని నిటారుగా నిలువబడిన ఆ మొక్కలు చాలా గొప్పవని అనుకుంటాను. నేలమీద ప్రాణాచారం పడిన ఈ మొక్కలు బానిస మొక్కలు కావూ?” అని అడిగాడు.

అతని మాటలు విని తండ్రి వెంటనే ఒక వెన్ను విరిచిచూపి “సదా! ఎంతో వినయంగా ఉన్న ఈ మొక్కల వెన్నులకు అందమయిన గింజ లెన్ని ఉన్నవో చూచావా? చాలా గొప్పవని నీ వనుకొంటున్న ఆ మొక్కలకు వెన్నులూ లేవు! గింజలూ లేవు” అని అన్నాడు.

తల యెంతొ యెత్తుగాఁ దాల్చెడువాఁడు
సామాన్యముగ గర్వ సహితుండుచూడు.

●

# బటానీలు

గారడివా డొకడు రాజుగారి దగ్గరకు పోయి - “అయ్యా!

ఇదివర కెవరూ చూపని గారడీ చూపుతాను; ఏలినవారు చిత్తగించవలె” అని మనవి చేసుకున్నాడు. ఆ రాజుగారు సరే నని అన్నారు.

గారడివాడు లోగడనే కొన్ని బటానీలు బాగా నానబోసి ఒక గిన్నెలో పెట్టుకుని ఉన్నాడు. తాను ఒక్కడే ఒక చిన్న గదిలో కూచున్నాడు. చూడవచ్చిన వాళ్ళందరూ రాజుగారితో సహా వెలుపల కూచున్నారు.

గారడీవాడు—“ఒక సూది ఇప్పించండి” అని అడిగాడు. రాజుగారు ఒక సూది తెప్పించి యిచ్చారు. గారడీవాడు ఆ సూది పుచ్చుకుని “అయి మాయి గారడీ” అని అంటూ దాని మొనతో ప్రతి గింజనూ సూటిగా ఇవతల నుండి అవతలకు పొడిచి చూపించడం మొదలు పెట్టాడు. ఒక గింజకూడా చీరుపోలేదు. అందరూ ఆశ్చర్యపోయారు.

ఆశ్చర్యం ఎందుకూ అని అంటారేమో. బటానీలు నునుపుగా ఉండుటవల్ల సూది మొన తగలంగానే జారిపోతవికాని సూది దిగబడటానికి దారి ఇవ్వవు. అందువల్ల అందరకూ ఆశ్చర్యం కలిగింది. పసిపిల్ల బాలాదీ చప్పటలు కొట్టారు.

దాని గుట్టు రాజుగారు గ్రహించారు. “అబ్బాయీ! నీవు చాలా కాలం కష్టపడి యీ విద్య సంపాదించావు కాబట్టి నీకు తగిన బహుమానం ఒకటి ఇస్తున్నా నుండు” అని అన్నారు. అటుపిమ్మట తమ నవుకరును పిలిచి ఏమిటో చెవిలో చెప్పారు. అది విని ఆ నవుకరు గబగబా వెళ్ళి ఒక చిన్న బస్తా నిండా ఏమిటో అక్కడికి తెచ్చాడు. గారడీవా డా నిండు బస్తా చూచి తన యిల్లు బంగారంతో నిండిపోతుం దని మురిసిపోయాడు.

బస్తా విప్పమని రాజాగారి సెల వయింది. విప్పేసరికీ అన్నీ బటానీలు.

అప్పుడు రాజావారు “అబ్బాయీ! నీవు చేసిన గారడీవల్ల

ఎవరికీ ఏమాత్రమూ ఉపకారము కలుగదు. కాబట్టి అందుకు తగినట్లుగానే నా బహుమతీకూడా ఉండాలి. నీవు మళ్లా యీ గారడీ చేయడానికి చాలా ఇబ్బంది పడిపోతావు. కాబట్టి నీకు బటానీలు బహుమతి చేస్తున్నాను.'' అని అన్నారు.

కాలంబు గడపకు కనుఁ(బాము పనుల
ఉపయోగములమీఁద నుంచుము కనుల.

●

## పొలము

సోమరి రంగయ్యకు పొలం లోనే గుడిసె. ఆ గుడిసె చుట్టూ కసింద పొదలు. జిల్లేడు మొక్కలు. తేలుకొండి చెట్లు. అక్కడా అక్కడా తుమ్మలు. ఎక్కడ చూచినా ముళ్లు.

ఎండవేళలో ఆ రంగయ్య ఆపసోపాలు పడుతూ ఒక తుమ్మ కింద పడుకున్నాడు. అప్పుడు అరుణాచలం అనే సంసారి జల్లావిండా ధాన్యం పోసుకుని బండి ఇంటికి తోలుకుని పోతూ వున్నాడు. అది చూడంగానే సోమరి రంగయ్య కన్ను కుట్టింది. అందువల్ల మర్యాదకయినా లేచి నిలబడక అవలించడం మొదలు పెట్టాడు.

అరుణాచలం కనిపెట్టి బండి ఆపి—"ఓయి రంగయ్యా! ఇప్పుడు నీవు పడుకున్నంత మేర అయినా చక్కగా తవ్వి సాగు చేసుకుంటే యీ ధాన్యానికి రెండింతల ధాన్యం పండించగలవు" అని అన్నాడు.

రంగయ్య కా సలహా నచ్చింది. అతడు కసిందలూ బొసిందలూ అన్నీ నరికి పారేశాడు. దుంప తీశాడు. మెత్తగా తవ్వడల్లే దున్నాడు. దాంతో అతని పంట పండింది.

సోమరి దుఃఖ మోర్చుకొని యున్నంత
తనపాటు రక్షించుఁ దన యింటి నంత.

●

## ద్రాక్షదొడ్డి


ఒక ముసలివాడు మూలుగుతూ మూలుగుతూ ముగ్గురు కొడుకు

లను పిలిచి- "నాయనలారా నాకీ నేలమీద ఋణం తీరిపోయింది. నాకీ గుడిసెలూ ద్రాక్షదొడ్డీ కాక వేరే ఆస్తి యేమీ లేదు. ఐతే చూచారా ఆ కాస్త దొడ్డిలోనే ఒక నిధివుంది. ఊరికే తవ్వుతూ తిరగేస్తూ వుండండి. కొన్నాళ్లకు మీకా నిధి కనబడగలదు" అని చెపుతూ శ్వాసలు విడిచాడు.

తండ్రి పోయినపిదప వాళ్లు ఆ ద్రాక్ష దొడ్డంతా చాలా ఓపికగా తవ్వారు, తిరగేశారు, బోర్లేశారు. వెండిగాని బంగారంగాని ఏమీ కనబడలేదు. కాని వారు అంతగా నేల తవ్వి తిరగేయడమువల్ల ద్రాక్షలుమాత్రం తెగ పండై. అందువల్ల రెట్టింపు డబ్బు వచ్చింది.

"తమ తండ్రి మాటల కర్థమిది కదా'' అని వారికప్పుడు తోచింది. ఆ దొడ్డి తలుపుమీద వారు ఇలా వ్రాసిపెట్టుకున్నారు.

కృషిలోన నవనిధుల్ కేరింతలాడు
మృషకాదు బంగారు మిలమిలలాడు.




ఈ పై బొమ్మలోలాగే, తెలుగు అక్షరాల్తో బొమ్మలు చేయగలరా?

## కొత్త సంవత్సరపు "జేజే" లు

మా కంపెనీలో భీమాలను తీసుకొన్న

తెలుగు తల్లులకు

తెలుగు తండ్రులకు

తెలుగు పిల్లలకు


# నాగ్‌పూర్ పయనీర్ ఇన్షూరెన్సువారి జేజేలు

ఈ కొత్తసంవత్సరంలో – అందరూ
ఆరోగ్యము – ఆనందము – అభివృద్ధి
పొందాలని కోరుచున్నాము.

పి. యస్. ఆర్. శర్మ
బ్రాంచి సెక్రటరీ,

నాగ్‌పూర్ పయనీర్ ఇన్షూరెన్సు కంపెనీ, లి.

నెం. 3, తంబుచెట్టివీధి, మద్రాసు 1.



# బెక బెక అంటే....

రచన : కొత్తూరి రాజగోపాలం (అమలాపురం)

ఒకనాడు ఒక తుంటరిబాలుడు చెరువుగట్టుమీద కప్పలు బెకబెకలాడుతూవుండగా, వాటిమీద రాళ్లు విసిరి, పకపక నవ్వి ఇలా అడిగాడు :

బాలుడు : బెక బెక లాడే కప్పా!
ఒకమాటడిగెద చెప్తావా?

కప్ప : పకపక నవ్వే బాలా
అడుగుము అడుగుము చెప్తాను.

బాలుడు : బెక బెక లాడే కప్పా
బెక బెక అంటే అర్ధంబేమి?

కప్ప : బెక బెక కాదోయ్ బాలా
బేకు బేకుమని అంటాము

బాలుడు : బేకులు బేకే కప్పా
బేకంటేను అర్ధంబేమి?

కప్ప : రాళ్లను రువ్వే బాలా
"తుంటరి" "తుంటరి" అని అర్ధం!




రచయిత : కొండపల్లి వెంకటరామదాస్, తుని.

## 2-వ మజిలీ


అలా మన బాలయ్య, తాతయ్య రెండో మజిలీ మెల్లగా చేరుకున్నారు. ఓసత్రంలో తాతయ్య మడికట్టుకుని వండుతూంటే బాలయ్య, ఆఊళ్లో వింతలూ, విశేషాలు చూడటానికి బయలుదేరేడు. అట్నుంచిటు ఓగంట సేపటిలో పరుగెత్తికొనివచ్చి, తాతయ్యోయ్! బలేతమాషా! ఈఊళ్లో అందఱూ ఓగరుడపక్షికి గుళ్లో నైవేద్యాలు, పూజలు చేస్తున్నారు. ఇదేమిటి తాతయ్యా! చెప్పవూ? అన్నాడు బాలయ్య. "అప్పుడే తెచ్చావ్ తంటా! ముందు భోజనం కానియ్యి! అన్నాడు తాతయ్య. సరే! ఎలాగో భోజనం అయిందనుపించుకొని "ఊ! కానియ్యి! తాతయ్యా" అన్నాడు మకాంవేసుకుని మన బాలయ్య. తాతయ్య ఓపొడుం పట్టు ఘాటుగాపీల్చి ఇలా చెప్పడం మొదలెట్టాన్నాడు. బాలయ్య "ఊ" కొట్టూన్నాడు.

### "గరుడ గుడికథ"

పూర్వం, ఈఊరు ఓచిన్న అగ్రహారం. ఇంట్లో అందఱూ బ్రాహ్మణులే వుంటూండేవారు. ఆబ్రాహ్మణులలో 'సూరిశాస్త్రి' అనే బ్రాహ్మణుడు ఘట్టిగా వేదాలు, వగైరాలు చదువుకున్నవాడు. పాపం! ఎంత చదువుంటే ఏం లాభం బాలయ్యా! అతనికి ఓపూట తిండివుంటే, రెండోపూట లేకుండా వుండేది. ఇంట్లో పెళ్లాం, ఇద్దఱుపిల్లలూ; వారిని పోషించటమెట్లా అన్న ప్రశ్న సూరిశాస్త్రుల్ని ఎప్పుడూ బాధపెడ్తూండేది. ఊరూరా భిక్షమెత్తి ఏ రాత్రో


ఇంటికి చేరుకొనేవాడు, కాసిన్ని బియ్యంతో. ఈలోపున ఇంటిల్లిపాదీ పస్తే అన్నమాట. ఈపంథా అతనికినచ్చలా. ఏఊరైనాపోదామనుకున్నాడు. ఓరోజు రాత్రి, పెళ్లాం, పిల్లలకి తెలియకుండా, ఇంట్లోంచి ఉడాయించేశాడు.

అలా ఆ బ్రాహ్మడు తనకు తోచిన దిక్కుగా బయలుదేరాడు. దార్లో చాలా అడవులు నదులు, ఎన్నో దాట్తూవచ్చాడు. పగలు ఏ కాయో, గసరో తినటం, రాత్రుళ్లు ఏచెట్టుమీదో పడుకోవటం. ఇలా చాలాదూరం వచ్చేశాడు. రాగా, రాగా రెండు దార్ల మధ్యకొచ్చాడు. ఆ రెండు దార్లలో, ఒకదారి ప్రక్కన,




"తెలివిగలవాడి కిదేదారి" అని రెండవదారి ప్రక్కన "సోమరిపోతు కిదేదారి" అని రెండురాతి స్తంభాలు మీద చెక్కబడియున్నై. ఈ వింత చూచి, చాలా ఆశ్చర్యపడ్డాడు శాస్త్రి. సరే! నేనేం తెలివితక్కువవాణ్ణా అనుకుంటూ తెలివిగలవాడి దారే పట్టాడు మనశాస్త్రిజీ!

ఈవిధంగా రెండుమైళ్లుదాకా శాస్త్రి నడవగా ఓ పెద్దనది అడ్డంగా వచ్చింది. దీన్నెలా దాటడం దేముడా అంటూ, అక్కడ చతికిలపడ్డాడు శాస్త్రి. అయినా, ఏదైనా సాధనం దొరక్కపోతుందా అనుకుని, ఆఏటి వడ్డుమంటే తిన్నగా, వెళ్లగా, వెళ్లగా ఓచోట ఓచుక్కానిలేని పడవ వుంది. దానిమీద "బుద్ధినుపయోగించు" అనివుంది. మన శాస్త్రుల్లు మాత్రం, తక్కువవాడా ఏమిటి బాలయ్యా! చుక్కాని లేకుండా పడవ వుంటుందాఅని సాధనం కోసం అక్కడున్నచెట్లూ, పుట్టలూ వెతకటం మొదలెట్టాడు. ఇంతలో ఓపెద్ద మర్రిచెట్టుకిందకొచ్చాడు. ఆ చెట్టు పైకి చూచాడు. ఇంకేంవుంది! ఆ మర్రి




ఊడలలో ఓ పడవ చుక్కాని కట్టబడియుంది. ఎగిరి, ఒక్క దూకులో చెట్టెక్కి, ఆ పడవ చుక్కాన్ని, లాక్కొచ్చేశాడు, నదిలోవున్న నావదగ్గఱకు. వెంటనే, దాన్ని లోతు నీళ్ళలోకి లాగి, చుక్కాని సహాయంతో ఆవలిగట్టు చేరాడు. చూడు! బాలయ్యా! బుద్ధివుంటే ఎంత లాభమో?


ఇలా, అవతలొడ్డు చేరేటప్పటికి చిత్రం! మళ్లా దారి కనిపించింది అతనికి. అలా ఆ దారిపట్టి ముందుకు పోతున్నాడు. ఇంతలో అలసిపోవటంవల్ల, మన శాస్త్రుళ్లకి చాలా ఆకలి వేస్తూంది. పాపం! కళ్లు తిరగటం మొదలెట్టాయ్! వెనక్కి పోదామా అనుకున్నాడు. కానీ! ఎలా రానేవచ్చేం, పడవకి చుక్కాని దొరికినట్లు, ఆకలికి హారం దొరక్క పోతుందా, అనుకుని మొండిగా ముందుకు పోసాగాడు శాస్త్రి. పోగా పోగా అదృష్టాన్న, ఓపరువ్వకొచ్చిన మామిడి కాయలుగల, మామిడి చెట్టు కన్పించిందా బ్రాహ్మడికి. ఏముంటే, ఏమిటిలాభం! ఆచెట్టు మీద కోతులు గెంతుతూ, ఆడ్తూ, మొగ్గలేస్తూ, అరుస్తూన్నై. ఎలారా! అనుకుంటూ ఆ చెట్టుమీదికి చూచేటప్పటికి



ఓకొమ్మమీద ఇలా చెక్కబడియుంది. "ఉపాయంవుంటే ఆహారము". బలేగావుందే అనుకుంటూ చుట్టుప్రక్కల పొదలన్నీ వెతకటం ప్రారంభించాడు. విశేషం! ఓపెద్ద ముళ్ళపొదలో, ఓ కోతిచర్మం, పడివుంది. కాస్సేపాలోచించి, మనశాస్త్రి, దాన్ని తొడుక్కుని, గెంతుకుంటూ, ఆ మామిడి చెట్టెక్కి కావలసినన్ని కాయలు కోసుకున్నాడు. నమ్మితే

నమ్మ! బాలయ్యా! అచ్చంగా మన శాస్త్రికూడా ఓ కోతి స్వరూపంలో వుండుటవల్ల, ఆ నిజమైన కోతులు, ఈమనిషి కోతి జోలికి రాలేదు. శాస్త్రి ఆ చర్మాన్ని మళ్లా చెట్టుపొదలో దాచేసి, ఆ కాయలు తినుకుంటూ, ముందుకు పోసాగాడు మళ్లీ!

సరి! కొంచెందూరం పోంగానే శాస్త్రికి, ఓ సొరంగం అడ్డంగా వచ్చింది. దానికి రెండు పెద్ద తలుపులున్నై. ఆతలుపుల





మీద "తెలివిగల వాడికంతా ధనమే" అనివుంది దీన్ని తెరవటం ఎట్లా అనుకుంటూాంటే, పేరి శాస్త్రుల్లకి, ఆ తలుపులమీద ఓ చిన్న మఱ కనిపించింది. దానిని ఘట్టిగా, మూడుసార్లు త్రిప్పేసరికి, ఆ తలుపులు పెద్ద శబ్దంతో తెర్చుకున్నాయ్! ఒక్కసారి మన శాస్త్రికళ్లు జిగేల్‌మన్నై! చిత్రాతిచిత్రం! ఆ సొరంగం నిండా, జిగజిగ మెరుస్తూన్న మణులు పెద్దరాసిగా పోసిఉన్నై. చడీచప్పుడు చేయకుండా, శాస్త్రీజీ వడినిండా కొన్ని పోసుకుని, యథావిధిగా ఆ తలుపు బిగించేసి వెనక్కి మళ్ళేడు. మళ్ళీ, కోతులచెట్టు, నదీ దాటి, రెండు దార్ల నడిమికొచ్చేశాడు వొక్క అంచీలో!

కానీ! దీని అంతుకూడా కనుక్కుందాం అనుకున్న మన శాస్త్రి "సోమరి పోతుదారి" గుండా వెళ్ళడం మొదలెట్టాడు. అలా పోగా ఆదారి శాస్త్రిని తిన్నగా, ఓ పెద్ద ఱాతిబండదాకా తీసుకొా వెళ్లింది. దానిమీద ఓ పెద్ద గరుడపక్షి, రెక్కలాడించుకుంటూ శాస్త్రుల్లని చంపటానికి వచ్చింది. శాస్త్రి, దేముడికి దండాలు పెట్టడం మొదలెట్టాడు. వస్తూనే, ఆపక్షి అడిగిందికదా: "ఏంవోయ్! శాస్త్రీ! నీవు సోమరిపోతు దారిగుండా వచ్చావ్! సోమరిపోతా! నిన్ను చంపేస్తా చూడు!" అప్పుడు మన శాస్త్రి, దానికి మ్రొక్కి, ఓ, పక్షిరాజా! నీదయ, నేను మొదట తెలివిగల వాడి దారినేపోయి, ఈ దారి

కూడా చూద్దామనివచ్చా. ఇదిగో కావలిస్తే ఈ మణులుసాక్ష్యం, అని తను మణులు చూపించాడు. ఈమాట విందోలేదో! ఆపక్షి వెనక్కితగ్గి, సంతోషంతో ఇలా అంది: "ఓ బ్రాహ్మడా! ఇన్నాళ్ళకి నీవొక్కడవు తెలివైన వాడివి కనిపించావు! మీ మనుష్యల్లో అనేక రకాలు, త్రోవలో ఏదైనా అడ్డువస్తే, ఆపని మానేస్తారు. ఏదో అప్పటికి సుఖంగా వున్న మార్గాన్నిపోయి, తర్వాత వచ్చే కష్టాన్ని కానుకోలేరు. విను, నేనే ఆ రెండు త్రోవలను తయారు చేయించాను. తెలివి గలవాడి దారిలో అనేక అడ్డులుంచాను. ఇవన్నీ దాటుకున్న వాడికి, నా మణుల సారంగం బహుమతిగా వుంచా! ఎవరైనా, ఈదారి సుఖంగా వుందని, వచ్చేరా అంటే, ఓరి, సోమరులారా! అని వారిని చంపి తింటూన్నా. చూడు, ఆ కొండ గుట్టప్రక్క ఎన్ని ఎముకల ప్రోగులున్నాయో! ఆ మణులన్నీ నేను అది వరకు చంపిన నాగులవి. ఇహ నా ఉద్దేశంప్రకారం, ఆ మణులన్నీ నీవి. హాయిగా జీవించు. ఇన్నాళ్ళకి నా పరీక్ష ముగిసిందని, శాస్త్రి చూస్తూండగానే, ఆకాశంలోకి రివ్వున ఎగిరిపోయిందెక్కడికో ఆ పక్షి!

ఇక్కడ మన శాస్త్రి, ఆ పక్షికి ఓ నమస్కారంచేసి, ఇంటికి మరలిపోయి, పెద్దపెద్ద బళ్ళ మీద, ఆ సారంగంలోని మణులన్నీ తోలించుకుని వచ్చాడు. వచ్చీ రావడంతోటే, తోటి పేద బ్రాహ్మలికి కొన్ని మణులనిచ్చి, వారందరి సలహామీద, ఓ గుడి కట్టించి, అందులో ఓ గరుడపక్షి విగ్రహాన్ని స్థాపనచేసి, నిత్యమూ దానికి పూజలూ, నైవేద్యాలు జరిగే ఏర్పాటు చేయించాడు. ఇప్పటికీ, ఆ బ్రాహ్మడి సంతతుల వారు, ఆ గుడిలో, ఆ పక్షికి, నిత్యమూ, పూజలూ, పునస్కారాలూ చేస్తూంటారు. తెల్సిందా బాలయ్యా! అని కథ ముగించిన తాతయ్య లేచి నిలబడగా: బలే! తాతయ్యా! ఈవాళ చాలా పెద్ద కథ చెప్పావ్! చాలా బాగుంది! అంటూ తనూ నిలబడి మూటపట్టుకుని, ముందు దారి తీస్తూన్నాడు, మరో మజిలీకి మన బాలయ్య!




రచన: పాలంకి వెంకటేశ్వర్లు, 4-వ ఫారము (కాకినాడ)

నేను ఒకసారి మా తాతయ్యని 'ఒకకథ చెప్పవూ!' అని అడిగేను. మా తాతయ్య ఇలా ప్రారంభించాడు.

"అనగా అనగా రెండు పాములున్నాయి. ఆ పాములు రెండు సమానబలము కలవి. ఒక్కటే పొడుగు. ఒకనాడు ఆ రెండుపాములు పోట్లాడుకున్నాయి. ఒకపాము రెండవపాము తోకను నోటితో పట్టుకొని మ్రింగివేయడం ప్రారంభించింది. అపుడు రెండవపాము మొదటిపాముయొక్క తోకను నోటపెట్టుకొని మ్రింగటం ప్రారంభించింది. ఈవిధముగా ఆ రెండుపాములు ఒకదానినొకటి—మొదటిది రెండవదాన్ని, రెండవది మొదటిదాన్ని—మ్రింగేశాయి."

ఇది నిజమే అంటారా?

## "బాల" ఎడ్రసులో మార్పు:

ఇకముందు మీరు "బాల" కు రాసే వుత్తరాలు:

నెం. 3, తంబుచెట్టివీధి, మద్రాసు 1.

అని రాయండి. పాతయడ్రసుకు రాయవద్దు—మేనేజరు.

# సరికొత్త లాలిపాట

(రచన : గట్టి కమలమ్మ - నెల్లూరు)

చక్రవాకము - జంపె.

ప॥ లాలిలాలీ ! బాల - లాలిగోపాలా !
లాలిభరతాన్వయా - లంకార బాలా !

చ॥ పాలబుగ్గలు చాల - లీలగాఁ జెలఁగినవి
పాలించి మాకెల్ల - పాలకులు గారే ! ॥లాలి॥

వెన్న మీగడ జున్ను - అన్ని తినిపెరిగి
తిన్నగా మన తెనుఁగు - తేనె చవిగొనుము ॥లాలి॥

తుంగభద్రా కృష్ణా - భంగ దీపికలూ
గోదావరీ శోభఁ - గూడఁ గనఁ గలవు ॥లాలి॥

తిక్కన్న పోతన్న - తెలుఁగు పద్యాలూ
త్యాగయ్య సంగీత - మాలకించెదవూ ॥లాలి॥

నిత్య కల్యాణమూ - పచ్చతోరణమూ
తెలుఁగు నేలకుఁజేసి - పలుకుమో బాలా ! ॥లాలి॥




సంపాదన: డి. సుబ్బారావు, (కర్నూలు)

మా ఊళ్లో ఒక పిల్లాడు రెండో క్లాసు చదువుతున్నాడు. పేరు చి॥ బి. అప్పారావు. ఒకరోజున అగ్గిపెట్టెను గీచి, ఆ వింతను యీ విధంగా నాతో చెప్పాడు.

అగ్గిపెట్టెచూడ - అందముగావుండు
పెట్టెతీసిచూడ - పుల్లలుండు
పుల్ల గీచి చూడ - బుఱ్ఱుమనును
చెప్పనగునెదీని - వింత మీకు!

ఎనిమిదేండ్ల కుఱ్ఱాడు యీ పద్యం చెప్పాడంటే చిత్రంగా లేదూ! నిజంగా చెప్పాడు.

బాలా! నువ్వుకూడా కవిత్వం నేర్చుకో!

---

● ఆరణాలు
● బాల వెల ఆరణాలు
● బొమ్మలున్న బాల వెల అరణాలు
● గమ్మత్తుల బొమ్మలున్న బాల వెల ఆరణాలు
● వింతలతో గమ్మత్తుల బొమ్మలున్న బాలవెల ఆరణాలు
● సరిక్రొత్త వింతలతో గమ్మత్తుల బొమ్మలున్న బాలవెల ఆరణాలు


రచన: తొండపు వెంకట సీతారామయ్య, తాడికొండ.

# ★ ఎలుక చలగాటం ★




## 1

అనగా అనగా ఒక ఎలుక ఉగాదినాడు షికారు బయలు దేరింది. గోడవెనుక పీచుమిఠాయి కనబడింది.





## 2

"బలే అదృష్టం! పండుగ నాడు పీచుమిఠాయి దొరికింది"- అంటూ ఆఎలుక నోటితో....




## 3

....ఆ పీచుమిఠాయిని పట్టు కొని లాగింది ........గట్టిగా లాగింది....




## 4

"బాబోయ్! ఇది పీచు మిఠాయి కాదు! మ్యావ్ మ్యావ్ తోక! "అంటూ పరుగెత్తి ఆ ఎలుక పారిపోయింది.

# నే నె వ ర్ని?

మంచి మంచి వంటా
మరి మరి తింటా
బడికి వెళ్లమంటే
కడుపులోన మంటా!

* * *

బడిలో గంటా
గణగణ మంటూ
మ్రోగిందంటే
మూల దాక్కుంటా!

* * *

పంతులయ్య మాటా
వింటె చెవికి పోటూ
కొంటె మూక పాటా
వింటె ఎంతసేటూ!

* * *

తొమ్మిదికిని లేచీ
అమ్మ నేడిపించీ
అంతో ఇంతో లాగీ
అంతులేక తింటా!

* * *

కొత్త పుస్తకాలూ
కత్తిరించి వేసీ
నూలుబంతి తెచ్చి
గాలిపటము చేస్తా

* * *

నేనెవర్ని అంటూ
కనుక్కోమంటా!

రచన: "తూమాటి" అనంతపురం.


## జాబ్ కో
## వస్తువులు
### అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్‌కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్‌కో మార్కుగల వస్తువులే, అన్నిటికంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు.

జాబ్ కో నే కొనుడు.

●

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె; లైంగ్లిస్, హెర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

●

## జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.




# తంజావూరి సంగీత విద్వాంసులు

ఒక చాకలివానివద్ద ఒక గాడిదె ఉండేది. అది ముసలిదై పోగా ఆ చాకలివాడు దాన్ని చంపి దానిచర్మం అమ్మితే లాభిస్తుందిగదా అనుకున్నాడు. ఆ సంగతి ఆ గాడిదె తెలుసుకుంది. వెంటనే తప్పించుకుని తంజావూరురోడ్డు పట్టింది.

"తంజావూరులో పట్టణపు సంగీత విద్వాంసుడై రాణిస్తాను!" అనుకుంటూ పోతున్నది గాడిదె. దారిలో ఓ చెట్టు నీడన ఓ కుక్క పడుకుని మోర పైకెత్తి ఆలోచిస్తున్నది. దాన్నిచూచి "ఏమిటాలోచిస్తున్నావు?" అని గాడిదె పలకరించింది.

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావు

"ఏముందోయి. పెద్దతనం వస్తోంది. ఇదివరకులా కాపలా కాయలేకపోతున్నాను. నా యజమాని చావ చితకకొట్టాడు. తప్పించుకునివచ్చి యిక్కడ ఆలోచిస్తున్నాను" అన్నది కుక్క.

"అయితే మంచిదే. నేను తంజావూరు పోతున్నాను. అక్కడ పట్టణపు సంగీత విద్వాంసుడ్నిగా రాణిస్తాను. నీవు కూడా రా. నేను మురళి వాయిస్తాను. నీవు మద్దెలమోయించు",

అన్నది గాడిదె.

అందుకు సంతోషించి వల్లె అన్నది కుక్క.

ఆ యిద్దరూ పోతుండగా దారిలో ఓపిల్లి ముసురువానలో ముంగిసమొఖం మాదిరి మొఖం పెట్టుకుని నడుస్తుంటే చూచారు.

"నీకు కలిగిన కష్టమేమిటి?" అని గాడిదె పిల్లిని పలకరించింది.

"ఏమని చెప్పుకుంటాను! నా పండ్లు ఇదివరకుమాదిరి లేవు. పొడుంకాయ బిరడాలల్లే మొద్దు బారిపోయాయి. ఎలుకలను చంప లేకుండా వున్నాను. నా యజమాని నన్ను క్రిష్ణలో పారేద్దామనుకుంటుంటే తప్పించుకొచ్చాను.

"మాతో తంజావూరు రా. మా సంగీతానికి వంతపాట పాడుదువుగాని" అన్నది గాడిదె. అందుకు సందేహమా అంటూ పిల్లి గూడా వారితో పయనమైంది.

ఈ ముగ్గురు సంగీతపు రౌడీలూ పోతూండగా ఓ గడ్డివామికి ప్రక్కన ఓ కోడిపుంజు డొక్క లెగరేస్తూ కూస్తుండడం చూచారు.

"నరాలు ఉబికేటట్లెందు కట్లా కూస్తావూ?" అన్నది గాడిదె.

"ఏం మొత్తుకోను, నేనున్న ఇంట్లోకి అతిధులొస్తున్నారు. ఇంటావిడె నన్ను పులావు చేద్దామనుకుంటున్నది. ఏం తోచక కూస్తున్నాను", అన్నది కోడిపుంజు.

"ఓహో! అయితే మాతో రా. మేం తంజావూరు పోతున్నాం. అక్కడ పట్టణ సంగీత విద్వాంసులుగా రాణించవచ్చు" అన్నది గాడిదె.

"అంతకన్నానా!" అంటూ కోడిపుంజు వారివెంట పడింది.

వారంతా కలిసి ఓ అడివిదాపు కొచ్చారు. అక్కడ చీకటిపడింది. కోడిపుంజు ఎగిరి ఓ చిన్నచెట్టు కొమ్మమీదకూర్చుని అటూఇటూ చూచింది. దాపునే ఓ దీపం కనపడగా ఆసంగతి వారితోచెప్పింది. అంతాకలిసి ఆ దీపమున్నచోటికి పోయారు.

ఆచోటు ఒక దొంగలముఠా యిల్లు.

అందరిలో ఎత్తయిన గాడిదె ఆ యింటి కిటికీలోంచి తొంగి లోపల చూచింది.

''ఏం కనిపిస్తోంది?'' అని అడిగింది పిల్లి.

''ఏమిటా! ఓ బల్లమీద ఇష్టమొచ్చినన్ని తినుబండారాలున్నాయి. చుట్టూ దొంగలు కూర్చుని కడుపార ఆరగిస్తున్నారు. ఆహాహా!'' అన్నది గాడిదె.

ఆ మాటలువిని ఆ నలుగురూ ప్రక్కకుపోయి తమలో తామాలోచించుకున్నాయి. ఏ పంథా త్రొక్కాలో చర్చించాయి. వెంటనే లేచాయి.

గాడిదె ఆయింటి కిటికీపై ముంగటికాళ్లెత్తిపెట్టింది. గాడిదె మీద కుక్క నుంచుంది. కుక్క మీద పిల్లి కూర్చుంది. పిల్లిమీద కోడి వాలింది. అదివరకు అనుకుని నిర్ణయించుకున్నట్లుగా ఒకేసారి అన్నీకూడి సంగీతం ఆరంభించాయి.

ఆ సంగీతానికి ఆ యింటి కిటికీలు దర్వాజాలు అదిరిపోయాయి. వంటకాలు తింటూన్న దొంగల గుండెలు దోచుకుపోయాయి. ఆ దొంగలు త్రోవకానకుండా తొందర తొందరగా లేచి వెనక్కు చూడకుండా పరుగెత్తిపోయారు.

ఈ నలుగురూ లోపల ప్రవేశించి వారి యిష్టమొచ్చినట్లు అక్కడి తినుబండారాలన్నీ కానిచ్చాయి అంతా అయింతర్వాత దీప మార్పేసి ఎవరి అలవాటు చొప్పున వారు పడుకున్నాయి.

అర్ధరాత్రివేళ దూరాన్నుంచి దొంగలనాయకుడు తమయింటిని చూచాడు. అందులో దీపంలేదు. తాము వెర్రిగా భయపడ్డాం అనుకున్నాడు. మరోదొంగను పిలిచి చూచిరమ్మన్నాడు.

చూడడానికి పోయిన దొంగ ఆయింటి వంటగది ప్రవేశించాడు. ఓ నిప్పుపుల్లగీసి అటూ యిటూ చూచాడు. ఓమూల పడుకున్న

పిల్లి కళ్లనుచూచి నిప్పులల్లే కనపడగా అవి మండుతూన్న బొగ్గులనుకున్నాడు. దగ్గిరకు పోగానే ఆ పిల్లి వాడి ముఖంమీదపడి రక్కి వదిలిపెట్టింది. వాడు హడిలిపోయి వెనకవాకిలికి పరుగెత్తాడు. అక్కడ పడుకున్నకుక్క వాడిమీదపడి కాలు కరిచింది. వాడు చూరుక్రింద నుంచుని కాలిమీది గాయాన్ని ఒత్తుకుంటుంటే అక్కడే పడుకున్నగాడిదె వెనక కాలుతో ఒక్కతాపు తన్నింది. ఈ సందడికి మేల్కొని కోడిపుంజు, బంగాళాబాణీలో మరాట మాదిరిలో, ఫార్సీఫక్కీలో, కొక్కొరోకోయిమని ఫెళ్లున కూసింది. దొంగకు నరాలుసడలిపోయాయి. అట్లాగే పరుగెత్తిపోయాడు.

వాడుపోయి నాయకునితో ఇట్లా చెప్పుకున్నాడు. "ఆ యింట్లో ఓ దయ్యముంది. ఆ దయ్యం నాముఖమంతారక్కింది. వాకిట్లో కత్తితో ఓ రక్కసుడున్నాడు. నేను బయటికి రాగానే నా కాలుమీద కత్తితో పొడిచాడు. ప్రక్కకు తిరగంగానే వో పిశాచం దభాలున తన్నింది. అంతేగాదు, ఆ యింటిమీద ఓ లంబాడి దయ్యంకూడా వుండి 'కొయ్యోరోయి, వాడివొళ్లుకొయ్యరోయి!' అని అరిచింది. అమ్మమ్మ!"

ఆ కథ విన్నతర్వాత ఆ యింటివద్ద ఆ దొంగలు మరేం చేయలేకపోయారు. ఆ యింటి వాసం ఆ నలుగురికీ బాగా అమరిపోయింది. ఈనాటికీ ఆ నలుగురూ అక్కడే వాసంచేస్తున్నారేమో!

బాల

సం॥ చందా రూ 5/-
(ప్రత్యేక సంచికలతో సహా)
వీ. పి. పద్ధతి లేదు.

3, తంబుశెట్టివీధి; మదరాసు 1.

# అక్షరాల తమాషా


రచన : కె. జి. బాబూరావు (చిలకలపూడి)

[తెలుగు అక్షరాలు సులువుగా నేర్పే పద్ధతులు, అక్షరాల్లో అవసరమైన మార్పులు కావాలి. ఇది చదవండి. —సం॥

తెలుగు అక్షరాలను తమాషాగాను, త్వరగాను దెబ్బలూ, ఏడుపులూ లేక నవ్వులతోను ఆటలతోను వచ్చునట్లు ఒక క్రొత్త పద్ధతి కనిపెట్టబడింది.

ఈ క్రొత్త పద్ధతి సంగతి యేమిటంటే, మెట్టుమీద మెట్టు ఎక్కడం. ఒకపెద్ద కొండ వున్నాదనుకోండి. దానిపైకి ఎక్కడం ఎంత కష్టం! అయితే దానిమీదకు మెట్లు కట్టిస్తే ఎంత సులభం అవుతుంది! నేలమీదనుంచి మెట్టుపై మెట్టుఎక్కి, సులభంగా కొండ మీదికి ఎక్కిపోవచ్చును. అలాగే అక్షరాలు నేర్చుకున్నప్పుడు ముందు "అ ఆ"లు కాకుండా, అన్నిటికంటే సులభమైన అక్షరం నేర్చుకొని, తరవాత తక్కినవి మెల్లగా నేర్చుకోవచ్చును.






ఒక మనిషి కూర్చొని జపం చేస్తూ వున్నపుడు, ముద్దగా సున్నాలాగ వుంటాడు. సున్నా ఎక్కడ వచ్చినా "మ్" అని పలకాలి. జపము అయాక అదే మనిషి చేతులెత్తి చదువురానా అని సరస్వతీ దేవికి ప్రార్థిస్తాడనుకోండి. త ల క ట్టు అనే గీత, తలఎత్తి చేతులు




చాచి, కట్టుకున్న
ట్లుంటుంది. సున్నా
మీద తలకట్టు గీస్తే
"ర" అవుతుంది
రలో చుక్క పెడితే






"ఠ" అవుతుంది. "ర" కడుపులో నుంచి అడ్డముగా గీతగీస్తే "ఱ" అవుతుంది!




"ర" మధ్య అడ్డముగా గీత గీసి రెండు భాగములుగా చేస్తే పైభాగము గ అవుతుంది.

క్రింది భాగమును చిన్న సున్నా తో మొదలు పెడిడే "ల" అవుతుంది.




ఇంకో తమాషా. గ, ల



ఈ రెండు ముక్కలను గీతగీసి కలుపుతే "క" అవుతుంది చూశారా? కలుపుటవలన వచ్చినది కనుక "క".

క క్రింద రెండు అరసున్నాలు గీస్తే "క్ష".



"ల" అనే అక్షరం వస్తే ఆ, అ, త, శ సులభంగా వచ్చాయన్నమాటే!

"త్ర" తలవలె వుంటుంది. తలకు రెండు వైపుల చెవులు, సున్నాలు, పైన జుట్టు తలకట్టుగాను వున్నాయి చూడండి.



# చిన్నిపాప

రచన: "అబ్బాయి"

జేజె చూడగానె చేతులుజోడించి
వందనమ్ము చేయవలయు మనము
అమ్మ నాన్న అక్క అందరికిని జేజె
అన్నియిచ్చునంట చిన్నిపాప ॥

● ● ●

తప్పట్లు, తాళాలు తధిగిణల్ దడబిడల్
దేవళమ్ములోన దివ్వె దివిట
పాలు బియ్యముతెచ్చి భగవంతుడికి ఇస్తె
పళ్లు నెయ్యి మనకు బాలపాప ॥

● ● ●

కొండలన్నీ వెలుగ గోరంత దీపమ్ము
మేడ అంతవెలుగ మినుకుచాలు
గోవులన్నీ వెలుగ గోపాలకృష్ణమ్మ
అన్ని కళ్లువెలుగ చిన్నిపాప ॥

● ● ●

నాన్న వచ్చినంత నవ్వుచూ కేరుచూ
అమ్మచూచినంత ఆవులించు
తోటిపాపలచూచి దోబూచులాడును
ఎన్నినేర్చెనమ్మ చిన్నిపాప ॥

● ● ●

పూలు చూచినంత పురపురావిరజిల్లు
పుస్తకాలు చింపి పోగువెట్టు

ఇంత చీలి పాప కేమీయగలమింక
చింకిపాతతప్ప చిన్నిపాప॥

● ● ●

పాపనవ్వితేను పౌర్ణమివెన్నెల
చిన్నిపాపముద్దు వెన్నముద్ద
పాపపలుకువేలు వజ్రవైడూర్యాలు
చిలుక తల్లికాదె చిన్నిపాప॥

● ● ●

బువ్వతినుటచూచి పులిలాగపైబడున్
చదువు ముందుగానె సాగనీదు
వ్రాతకాగితాల పారజిమ్మును సిరా
చేరదీయ భయము చిన్నిపాప॥

● ● ●

ఏదితెచ్చుకొన్న వాదించి గీపెట్టి
పీకి పాకి పాక వేసితీరు
చూచినట్టిదెల్ల చుట్టబెట్టుకొనాలి
చిక్కులెన్ని తెచ్చు చిన్నిపాప॥

● ● ●

అమ్మమీద నాన్న ఆరడిచేయగా,
నాన్నమీద అమ్మ నసుగుకొన్న,
చిట్టిపాప చిన్ని చిరునవ్వుతోసరి
ఎన్ని చేయగలదు చిన్నిపాప॥

● ● ●

మడతవిప్పినట్టి మంచిబట్టలుకట్ట
మన్నుపూసిపెద్ద మరకచేయు
కన్నులెఱ్ఱజేసి కసరగా పోవగా
చేయిజాచి నవ్వు చిన్నిపాప॥

# * అక్క - చెల్లి *

రచన: నిట్టల శ్రీ రా మ మూ ర్తి

"అమ్మా! బిచ్చ మెయ్యండమ్మా" అంటూంటే "ఇంట్లో ఏంలేదు, పో" అని తలుపు వేసెయ్యబోతుంది అక్క.

"ఉండు అబ్బీ" అని తన బుల్లి చేతుల్తో బియ్యం వేస్తుంది చెల్లి.

వాళ్ళ నాన్న ఏమేనా తెచ్చిపెడ్తే ఇంకా కావాలని అల్లరి చేస్తుంది అక్క.

తనదికూడా అక్కనే తీసుకొమ్మంటుంది చెల్లి.

స్కూల్లో నోట్సు అడిగితే "నేను చదువుకోవాలమ్మా" అని బెట్టుసరిచేసి ఆఖరికి ఇవ్వకుండా పోతుంది అక్క.

అడిగిన వెంటనే ఇస్తుంది చెల్లి.

రాత్రి ఏడుగంటలేనా కొట్టకుండానే నిద్దరోతుంది అక్క.

ఎనిమిదిన్నరదాకా చదువుకుని పడుకుంటుంది చెల్లి.

పొద్దున్నే ఏడైతేగాని ఎంత లేపినా లేవదు అక్కయ్య.

ఆరింటికి తనంతట తనే లేస్తుంది చెల్లాయి.

అస్తమానూ ఆటలే అక్కయ్యకి.

చదువుకొనేటప్పుడు చదువూ, ఆడుకునేటప్పుడు ఆటలూ చెల్లికి.

క్లాసులో ఆఖరి మార్కులు అక్కవి.

ఫస్టు మార్కులు చెల్లివి.

ఎవరేనా ముచ్చటికి పాడమంటే పదిసార్లు అనిపించుకుని, అనిపించుకుని పాడుతుంది అక్క.

పాడమనగానే పాడుతుంది చెల్లి.

బుల్లి పాపాయి తమ్ముడిని ఎత్తుకుందుకే విసుగు అక్కకి.

తమ్ముడ్ని బాగా ఆడించి, నవ్వించడమంటే సరదా చెల్లికి.

అమ్మ పిలవగానే జడవేయించుకుని, నీళ్ళు పోసుకుని మంచి బట్టలతో తయారవుతుంది చెల్లాయి.

ఎంత పిలిచినా రాక ఊరికే కాలంగడిపి చీదరగా వుంటుంది అక్క.

వాళ్ళన్నయ్య చాక్లెట్లు తెస్తాడు.

అవన్నీ లాక్కుని అక్క తినేస్తుంది.

అమ్మ వంట వండుతూంటే అవీ, ఇవీ అందిస్తూ సహాయంగా ఉంటుంది చెల్లి.

ఎప్పుడు వంటవుతుందా, ఎప్పుడు భోంచేద్దామా అనే దృష్టితోనే ఉంటుంది అక్క.

ఇందులో మీకు ఎవరు అవాలని ఉంది ?


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్నయెడల వెంటనే
పాత్రుడుగారి
# బాల సంజీవిని
యీయండి
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.
వివరములకు :
## డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,
11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి :
నెం. 7. సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి :
నెం. 15, పుగళై పిళ్ళే వీధి,
తెప్పకొలం.

# ★ తెలంగాణాలో

బాలా! నీకు తెలంగాణా అంటే తెలుసునా? తెలంగాణా అంటే, నైజాం సంస్థానంలో వుండే తెలుగుదేశం అన్నమాట.

ఈ తెలంగాణాలో మన తెలుగువారు ఒక కోటిమంది వున్నారు. కాని వాళ్లు చాలా బాధలు పడుతున్నారు.

నీవు ఇప్పుడు తెలుగులో చదువు నేర్చుకుంటున్నావు కదూ? అక్కడ అలాక్కాదు - రెండవ తరగతినుంచే చదువు వుర్దూలో చెప్తారు. (వుర్దూ అంటే తురక భాష).

ఇక్కడ వున్నట్లు అక్కడ బడులేలేవు. అనేక వూళ్లకు కలిసి ఒక బడి వుంటుంది. హైస్కూళ్ళు చాలా తక్కువ.

చదువుసంగతి ఇలా వుందా- ఇంక అక్కడ ప్రజల సంగతి చూద్దాం.

మనదేశంలో జమీందార్లులాగే అక్కడ దేశముఖులు వున్నారు.

ఈ దేశముఖుల రాజ్యంలో మనలాగ ఎప్పుడుపడితే అప్పుడు మీటింగులు, ఊరేగింపులు, చేయడానికి వీలులేదు. భజనలు, హరికధలకుకూడా "హుకుం", అంటే అనుమతి, కావాలి.

ఇంక పన్నులబాధ చెప్ప తరంకాదు. కుండలు చేసుకుంటే పన్ను, బట్టలు ఉతుకుకుంటే పన్ను, కట్టెలు కొట్టుకుంటే పన్ను, ఇలాగ అనేక పన్నులు ప్రజలు ఇచ్చుకోవాలి.

## వెట్టీపని

ఇంకో సంగతి. పన్నులు ఇచ్చుకోడమేకాకుండా, పాపం,



# కోటిమంది ఆంధ్రులు ★

రైతులు తమతోటలో పండే కూరగాయలు దేశముఖులకి ఊరికేఇచ్చీయాలి! బఱ్ఱె యీనితే పాలూ, జున్నూ ఇవ్వాలి. కుమ్మరి కుండలు ఊరికే ఇవ్వాలి చాకలి ఊరికే బట్టలు ఉతకాలి. రైతులు ఊరికే పొలం దున్నాలి. కూలీలు వూరికే బండ్లు కట్టాలి. ఈ చాకిరీ అంతా చేసినందుకు దేశముఖులు డబ్బు ఇస్తారా? అబ్బే! అదేమీ లేదుగాని, యీచాకిరీ చేయక పోతే పాపం వాళ్ళను ఎండలో నిలబెట్టి బండ ఎత్తుతారు. కొరడాతో కొడ్తారు. దీనినే వెట్టి చాకిరీ అంటారు.

మన తెలుగు ప్రజలు తెలంగాణాలో ఇన్ని కష్టాలు పడలేక, సంఘాలు పెట్టుకున్నారు. మీటింగులుచేసి, 'మాకు ప్రజారాజ్యం కావాలి'—అని అన్నారు.

అంటే, దేశముఖులకీ, జమీందారులకీ కోపం వచ్చింది. ప్రజానాయకుల్ని పట్టుకొని జైలులో పెట్టారు. నానాబాధలూ పెట్టారు. మిలిటరీ వచ్చింది. తుపాకులు కాల్చారు. ప్రజలు భయపడి అడవుల్లోనూ, పొలాల లోనూ దాగున్నారు.

అక్కడ వీలాంటి మన తెలుగుపిల్లలగతి ఎలాగుందో-- పాపం.

బాలా! నువ్వు తెలంగాణాలో వున్న మన తెలుగు పిల్లలకు తెలుగు తలిదండ్రులకు సహాయం చేయవూ? మీ బాల సంఘాలు సభలుచేసి, తీర్మానాలు చేసి, వారికి ధైర్యం చెప్పవూ?

రచన : రామరాజు నరసింహారావు.
(పొందుగల.)






రచన: పింగళి పరశురామయ్య

తమ్ముడూ! కొన్ని నెలల క్రితం, విమానాలు, వేడినీళ్లు, కాఫీ మొదలైనవి పోసుకునే సీసాలు తయారు చేయడానికి వుపయోగించే అల్యూమినియం గురించి నీవు బాలలో చదివే వుంటావు.

ఇప్పుడు, నీవు పలకలమీద వ్రాసేందుకు నీవు ప్రతిరోజూ వుపయోగించే బలపాలు ఏ రాయితో తయారవుతాయో ఆ రాయిని గురించీ, ఆ రాయి మనదేశంలో, అంటే తెలుగు వాళ్ళ దేశంలో ఎక్కడెక్కడ దొరికేదీ తెలుసుకోడం మంచిది.

ఈ రాతిని ఇంగ్లీషువాళ్లు స్టియటైట్ లేక సోప్‌స్టోన్, అంటారు. ఇది తెల్లగా, నునుపుదనం కలదిగా భూమిలో పుడుతుంది. దీనితో బలపాలు చేస్తారు. బాగా తెల్లగా వుండే మంచి రకపు యీ రాయితో మన చెల్లాయిలు ముఖానికి అద్దుకొనే తెల్లని పొడుం - ఫేస్ పౌడరు చేస్తారు. మనం ప్రతిరోజూ వ్రాసే తెల్ల కాగితం నునుపుగా చేయడంలో కూడా దీన్ని చాలా వుపయోగిస్తారు.


మనం ఎక్కే మోటారుకారు నడవడానికి బిగించే రబ్బరు చక్రాలు చేయడంలో కూడా యీ రాయిని ఎక్కువగా ఉపయోగిస్తారు.

ఈ రాయి మన తెలుగు దేశంలో చాలా చోట్లవుంది. ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోని గూడూరు రైలు స్టేషనుకు సుమారు 12 మైళ్ళ దూరంలో వున్న సైదాపురం అనేవూరు దగ్గిర చాలావుంది. ఇక్కడవుండే వాళ్లు, యీ రాతితో, మనం


పచ్చళ్లు పెట్టుకొనే రాచిప్పలు చేస్తారు. ఈ జిల్లాలో చదువుకొనే మొద్దుతమ్ముళ్ళనూ, చెల్లాయిళ్ళ్నీ, బడిపంతుళ్లు, సైదాపురం రాచిప్పలని, ఎగతాళి చేస్తారు.

ఒక్క నెల్లూరు జిల్లాలోనే గాక, కర్నూలుజిల్లా, అనంతపురం జిల్లాలలోగూడా చాలా చోట్ల యీ రాయి ఎక్కువగా వుంది.

నీవు పెద్దవాడవైం తరువాత, రాళ్ల శాస్త్రాన్ని చదువుకొని, యీ రాతి కొండల్ని త్రవ్వించి, పై వస్తువుల నన్నింటినీ తయారు చేయించి, మన దేశాన్ని గొప్పదిగా చేద్దువుగాని.



వాహినీవారి "యోగి వేమన" లో "జ్యోతి" గా నటించిన చిట్టిబాల "కృష్ణ వేణి"


పరిశుభ్రతకు
పూచీ
తాము తయారుచేసే సరకుల్లో అతి
అమితమైన పరిశుభ్రత ఉండేటట్లు
చూడటం పెప్పర్ మింట్లు వగైరా
తయారుచేసే ప్రతివారికీ విధి. స్వీట్లు
అపరిశుభ్రంగా ఉంటే, హాని చేస్తవి.
స్వీట్స్ ఎక్కువగా తినేది చిన్నపిల్లలు.
అందువల్ల తమ సావరిన్ స్వీట్స్ ప్రతిదీ
కూడా అమితపరిశుభ్రంగా ఉంటుందని
కె.సి.పి.వారు గట్టిగా చెబుతున్నారు.
సావరిన్
స్వీట్స్
కె. సి. పి. తయారీ
KCK STG



బాల బాలికలు
　రారండీ - రారండీ
నడుములు గట్టండీ
జండా ఎత్తండీ
జైజై అని దీక్షబూనండి ॥
　బాలుని ప్రతిభ
　ప్రహ్లాదుని భక్తి
　అమరజీవుల గాథ
మనమున తలచండి
　వీరావేశముతో
　వెనుకంజిడక
　దేశ సేవకై
　దీక్షబూనండి ॥బాల॥
భావి భారతదేశము
　మీదేనండి
పాలింపగ
　మీరేనండి
లే లెండి-నడుములు గట్టండి
　రారండీ! రారండీ!!

రచన : "సీను".


# పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి.

జాబ్‌కో ఫౌంట్ ఇంక్ తో

రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




## జాబ్‌కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్నాకులం.




# అమృత సరము

ఈ పేరు వినేసరికి, దేవతలు, రాక్షసులు, అమృతంకోసం యుద్ధం చేసుకోడం, గరుత్మంతుడు పాములకోసం అమృతం తీసుక రావడం, యిలాంటికథలు జ్ఞాప కాని కొస్తాయి.

“అమృతసరము” మన దేశపు వుత్తర భాగానుండే గొప్ప నగరం. ఈ భాగానికే ‘పంజాబ్’ అని పేరు. ఇక్కడ నివసించే వాళ్లని శిక్కులు అంటారు. చాలాకాలంనుంచీ శిక్కులకు మంచీ చెడ్డలు బోధించే మత గురువు లుండేవారు. అలాంటి గురువులలో రామదాసు ఒకడు.

రామదాసు చాలా మంచి వాడు. ఈ శిక్కులందరికీ ఆయన మీద చాలాభక్తి. అప్పుడు రాజుగావుండే అక్బరు కూడా, శిక్కులు, రామదాసు అంటే చాలా గౌరవము, భక్తి వుండేవి. అందుచేత రామదాసుకు కొంత చోటును బహుమానంగా యిచ్చాడు అక్బరు పాదుషా.

ఆ చోటులో పెద్ద కోనేరును త్రవ్వించి, ఆ కోనేటి నడుమ విష్ణుదేవాలయం కట్టించాడు రామదాసు. దానికంతటికీ “అమృత సరస్సు” అని పేరు పెట్టాడు. ఆ సరస్సు చుట్టుపక్కల నెమ్మదిగా వూరు పెరిగింది. ఆ వూరికి కూడా “అమృత సరస్సు” లేక ‘అమృత సరము’ అనేపేరు వచ్చింది. హిందువులకు కాశీ క్షేత్రంలాగే

శిక్కులకు అమృతసరము పుణ్య క్షేత్రమైంది. ఎప్పుడు వేలకు వేలుగా శిక్కులువచ్చి సరస్సులో స్నానంచేసి, గుడిలో దేముణ్ణి పూజించి వెళ్లేవారు.

ఇలాగే రోజులు గడుస్తూండగా ఒకనాడేమైందనుకున్నారు. అమృతసరానికి మహమ్మదీయులు వచ్చారు. తుపాకీ మందుతో దేవాలయాన్ని పగులగొట్టి, విష్ణుమూర్తి విగ్రహాన్ని ముక్కలు ముక్కలుగా చేశారు. అంతటితో వారి కసితీరలేదు. సరస్సునంతా రాళ్లతో మట్టితో పూడ్చేశారు. వేలకొద్ది ఆవులను, దూడలను గుడిదగ్గరే పొడిచి చంపి వూరంతా పాడుచేసి వెళ్ళిపొయ్యారు.


పాపం! శిక్కులెంత దుఃఖించారో! మళ్ళీ అందరు కలిసి సరస్సును బాగుచేసికొని మంచి గుడికట్టుకున్నారు. కొంత కాలానికి రంజితశింగు అనేరాజు బంగారంతో గుడికంతా పూతపూయించాడు. ఆగుడి ఎంత చక్కగా వుంటుందనుకున్నారు! అచ్చంగా బంగారుతో చేసిన బొమ్మలాగుంటుంది. అందుకే దీన్ని "బంగారు దేవాలయము" అంటారు. సరస్సులోని తెల్లని నీటిలో గుడినీడ చక్కగా కనిపిస్తుంది. సూర్య కిరణాలీగుడిమీద పడినప్పుడు కళ్లు చెదిరిపొయ్యేలాగా తళతళ మెరుస్తూ చాలా దూరానికి కనిపిస్తూంటుంది.

ఈ గుడిలో యింకా చిత్రాలెన్నో వున్నాయి. గుళ్లో తలుపులన్నిటిని వెండి రేకులతో కప్పేశారు. దీపాలు వెలిగిస్తే లోపలంతా పగటిలాగే వుంటుంది. లోపల వజ్రాలతో మెరిసే రాజకిరీటముంది. మనకు వేదాలు, పురాణాలు చాలా పవిత్రమైనవి. అట్లాగే శిక్కులకు "గ్రంథ సాహెబ్" అనే పుస్తకం చాలా పవిత్రమైనది. వాళ్లందరు దాన్ని కళ్లకద్దుకొని పూజిస్తారు. సంవత్సరానికోమారా పుస్తకానికి పెద్ద వుత్సవం చేస్తారు. శిక్కుల మత గురువుకూడా ఈ దేవాలయంలోనే వుంటాడు. దేవాలయం నీటి నడుమ వుందిగా. అందు

కోసం. అందరు వెళ్లడానికి మంచి వంతెన కట్టారు. ఎప్పుడైనా ఎక్కడైనా యిలాంటి గుడి చూశారా?

ఈ నగరాన్నే "అమృతసార్" అనికూడా అంటారు. ఇప్పుడిది చాలా పెద్దనగరం. ఇక్కడ గొప్పగొప్ప ధనికులు, వాళ్ళ మేడలు. చాలా వున్నాయి. ఈవూళ్లో ఉన్ని శాలువలు, శిల్కుబట్టలు, దంతపు బొమ్మలు చాలా తయారుచేస్తారు. కొత్త కొత్త దేశాలనుంచి వ్యాపారస్తులు చాలామంది వస్తారు. అందుచేతనే అమృతసరములో బజార్లన్ని బలే అందంగా కనిపిస్తాయి. అక్కడ మగవాళ్ళకు ఆడవాళ్ళకు, యిద్దరికి యించుమించు ఒకేరకం బట్టలుంటాయి. ఇద్దరు పొడుగాటిలాగులు తొడుగుతారు. మగవాళ్లందరికి తప్పకుండా మీసాలు, గడ్డాలు వుంటాయి. తమాషాగా వుందిగదూ!

అమృతసరము గూడా ఒక పుణ్యక్షేత్రం కాబట్టి అందరు వెళ్ళి సరస్సును, దేవాలయాన్ని చూచి రావడం మంచిది.



అమృత సరస్సు

"బాల" ఎడ్రసు మార్పు: ఇకముందు "బాల" కు మీరు రాసే వుత్తరాలు, 3, తంబుశెట్టివీధి, మదరాసు 1. వ్రాయండి.

# చిలుక పలుకులు

సంపాదన: రాజా. ఆర్. వి. ఎమ్. వి. చంద్రరావు

(బొబ్బిలి)

బాల :- అమ్మా! నాకు ఇంగ్లీషులో 80 మార్కులు వచ్చాయని నాన్నతోచెప్తే సంతోషించి నాచదువు చిలుక పలుకులని అన్నారు. అంటే నేనంత ముద్దుగా మాట్లాడుతానన్నమాట.

అమ్మ :- కాదు. కాదు. నీ చదువుకు ఎగతాళి చేశారు.

బాల :- ఎంచేత ?

అమ్మ :- మొన్న నిన్న అతి సులభమైన మాటలకు అర్ధమడుగుతే చెప్పలేక పోయేవు కదూ! అందుచేత నీ చదువు చిలక పలుకులని వెక్కిరించారు.

బాల :- చిలుక పలుకులంటే వెక్కిరించడమా ? ఏలాగు ?

అమ్మ :- అంటే చిలుక ఏమాటలు చెప్పతే ఆ మాట లే అర్ధము తెలియకుండా అంటుంది. అలాగే నీకుకూడా అర్ధము తెలియకుండా కొన్ని యింగ్లీషు ముక్కలు వచ్చునని నాన్నగారి ఉద్దేశము. అర్ధం తెలియకుండా మాట్లాడుతే ఎంత వికారంగా ఉంటుందో తెలుసా ? దానికో చిన్న కథ చెప్పతాను. వింటావా ?

బాల :- ఊ. చెప్పు.

అమ్మ :- అనగా అనగా ఒక ఇంగ్లీషు రాజుగారు ఉండేవారు. ఆయనకు సిపాయిలన్నా యుద్ధమన్నా ఎంతో సరదా. అందుచేత గొప్పగొప్ప జీతాలిచ్చి పెద్దసేనను కూర్చారు. వారమున కొకసారి యైనా ఆ సేనవద్దకెళ్లి ఆ సిపాయిలను పరీక్షించేవారు. సేనలో క్రొత్త భటుడెవడైనా చేరితే వానితో తప్పకుండా మాట్లాడేవారు. వానిని, “నీవయ

స్సెంత?'' ''నీవు మాసేనలో చేరి ఎన్నాళ్లు అయింది?'' ''నీకిచ్చిన బస, భోజనము, సదుపాయముగా నున్నవా?'' అని మూడు ప్రశ్నలు అడిగే వారు. ఎప్పుడు ఏక్రొత్త సిపాయిని అడిగినా, ఈమూడు ప్రశ్నలే వరుస తప్పకుండా అడిగేవారు.

ఇలా గుండగా, ఆ సేనలో ఒకసారి ఒక క్రొత్తభటుడు చేరాడు. వాడు చాలా బలంగాను, ఎక్కువ పొడవుగాను ఉండిచూచుటకు ఎంతో బాగున్నాడు. కాని వాడికి ఇంగ్లీషు ఏమీరాదు. సేనానాయకుడు వానికి రాజుగారు అడుగబోయే మూడు ప్రశ్నలకు వరుసగా జవాబులుమాత్రం ఎంతోకష్టంమీద చెప్పి వల్లింపించాడు.

ఆవారములో రాజుగారు మామ్మూలుగా సేనను చూచుటకు వచ్చారు. ఈక్రొత్త సిపాయిని చూచారు. వాని ఆకారంచూచి చాలా సంతోషించి, దగ్గరకు వెళ్లి, మామ్మూలు మూడు ప్రశ్నలు వానిని అడిగారు. కాని ఆ రోజున వరుసమాత్రం కొంచెము మార్చారు. మొదట, ''నీవు మాసేనలోచేరి ఎన్నాళ్లయింది?'' అని అడిగారు. పాపం ఆ సైనికుడు అర్థం తెలియదుకదూ, వాడు వల్లించిన మాదిరిగా తొలిజవాబు, ''యిరవై ఎనిమిది సంవత్సరములు.'' అని అన్నాడు! రాజుగారు ఆశ్చర్యముతో ''నీవయస్సెంత?'' అని అడుగగానే వాడు ''రెండువారములు'' అని చెప్పాడు. ఆ జవాబుకు రాజుగారికి ఏమియు తోచక, ''నీకు మతిపోయినదా? లేక నాకు మతిపోయినదా?'' అని అడిగేరు. వాడు ఏమీ చెలించకుండా, సంతోషముగా చిరునవ్వు నవ్వుతూ, ''చిత్తం, చిత్తం'' అని అన్నాడు. వెంటనే రాజుగారికి కోపమువచ్చి

వానిని తన్ని తగిలివేశాను.

చూచావా? బాలా! అర్థం తెలియకుండా మాట్లాడితే ఎంతచిక్కో? చిలుక పలుకు లంటే అర్థం తెలిసిందా?

బాల :- అవును-అమ్మా! బాగా తెలిసింది.

అమ్మ :- చిలుక పలుకుల చదువు తప్పు అని ఒప్పుకుంటావా?

బాల :- ఈ తప్పు నాదో కాదో రేపు మా మేష్టరుగారిని అడిగి తెలుసుకుంటాను.

# కావాలి

పొట్టకు అన్నం
అన్నానికి బియ్యం
బియ్యానికి డబ్బు
డబ్బుకి ఉద్యోగం
ఉద్యోగానికి శ్రమ
శ్రమకి విశ్రాంతి
విశ్రాంతికి సుఖం
సుఖానికి చదువు
చదువుకి 'బాల'
కావాలి.

రచన : కనకదండి విఠల్‌శాస్త్రి
(గుంటూరు)

# అరచేతిలో కన్నం!

ఈ చిత్రం చూశారా!

ఒక కాగితాన్ని గొట్టంగా చుట్టి, ఈ బొమ్మలో చూపిన మాదిరిగా, ఆ గొట్టం మీ కంటికి ఎదురుగా వుంచి, ఆ గొట్టంలోంచి చూస్తూ, మీ అర చేయి గొట్టంపక్కనే వుంచి; రెండవ కంటితో అరచేయిని చూడాలి. అలా చూస్తే మీ అరచేతిలో గుండ్రని కన్నం వున్నట్టు కనిపిస్తుంది, చూడండి.



రచన : సుబ్బారాయుడు (మెడికో.)

# ★ చెవి కోసుకుంటా! ★

రచన: "మహాలక్ష్మి"

"ఏంరోయ్, మురళీ! చాలా జోరుగా చదివేస్తున్నావే"

"అవున్రా మరి, ఇంక నెల్లాళ్లేగా పరీక్షలు. ఇంగ్లీషులో ఫస్టు మార్క్కు పోనిస్తానా మరి?"

"ఏడిశావ్, నీకు ఫస్టు మార్కేమిటి?"

"చూడు మరి దెబ్బంటే! నాకు ఫస్టుమార్కు రాకపోతే చెవి కోసుకుంటా"

"కోతలు కోసినట్టు కాదు! నిజంగా చెవికోసుకోవాలి మరి."

'ఇంతకీ ఫస్టుమార్కు రాకపోతే కదా? రాకుండా వుండదు లే.'

"అబ్బ! ఏం ధైర్యంరా, సరే చూద్దాంగా. మరి ఆలశ్య మవుతోంది. ఆటలకి వెడదాంరా"

"నేను రాన్రా, చదువుకోవాలి."

"చాల్లే, ఇంతోటి చదువూ, ఎక్కువైతే అజీర్ణం చేస్తుంది" అని మురళి చేతులో పుస్తకం లాక్కుని దాచేసి ఆటలకి లాక్కుపోయాడు నళిని.

పరీక్షలకి రాత్రీపగలూ కష్టపడి చదువుతున్నాడు మురళి ఫస్టుమార్కు కోసం! ఇంక విసుగెత్తింది. పరీక్షలు దగ్గరకొచ్చిన కొద్దీ "అబ్బ, ఎప్పుడైపోతాయిరా పరీక్షలు. హాయిగా అన్నం తిని నిశ్చింతగా నిద్రపోవచ్చు" అని తొందరపడుతున్నాడు.

సరే, పరీక్షలు రానూ వచ్చాయి, వెళ్ళనూ వెళ్లాయి.

ఇంతతో అయిందా తొందర! పేపర్లు ఎప్పుడు దిద్దుతారా, మార్కులు ఎప్పుడు చెప్తారా అని మళ్ళీ ఆదుర్దా!

నెల్లాళ్లయ్యాయి. అవ్వాళ ఇంగ్లీషు మార్కులు చెప్పారు. మురళిది సెకండ్ మార్కు!

"అయ్యో, ఫస్టుమార్కు పోయిందే" అని నిరుత్సాహంతో భారంగా ఇంటికెళ్లి కిక్కురు మనకుండా అన్నం తినేశాడు. ఎక్కడికెళ్లడానికీ మనస్కరించలా. సావిట్లో కూచుని 'ఫస్టుమార్కు ఎందుకు పోయిందా' అని ఆలోచిస్తున్నాడు.

ఇంతట్లోకి "ఏంరా, మీకు ఇంగ్లీషు మార్కులు చెప్పారా? ఎన్నొచ్చాయేమిటి?" అంటూ

నళిని ప్రత్యక్షమయ్యాడు గుమ్మంలో.

మురళి నిరుత్సాహంతో "సెకండ్ మార్కు వచ్చిందిరా. వెధవది, అరమార్కులో పోయింది ఫస్టుమార్కు"

"మరి, చెవి కోసుకుంటానన్నావ్?"

"ఎప్పుడూ?" అన్నాడు ఏమీ తెలియనట్లు.

'అవ్వాళ నాతో చెప్పావుగా?'

"అయితే మాత్రం, అర మార్కేగా తేడా?"

"ఇంతకీ ఫస్టుమార్కు కాదుగా?"

"అయితే కత్తిపట్టుకురా" అన్నాడు ఇంక లాభంలేదని.

"ఎల్లా కోసుకుంటాడో చూద్దాం తమాషా" అని కత్తి తేడానికి పరిగెట్టాడు నళిని.

పైకి మేకపోతు గాంభీర్యంతో అనడం అన్నాడు కాని కత్తి తెస్తే చెవి కోసుకోవడం ఎల్లాగాఅని సమస్య వచ్చింది మురళికి. ఎంతకీ తేల్లేదు. ఓమూల నళిని వచ్చేస్తాడేమోనని భయం! ఇంతట్లోకే మెరుపులా ఒక ఆలోచన తట్టింది. గబగబా ఇంట్లోకెళ్ళి "అమ్మా, నీపెట్టి తాళంచెవి ఎక్కడుందే?" అన్నాడు.

"ఆ మేకుకి తగిలించా. జాగ్రత్త! పారెయ్యకు. అయినా నీకెందుకురా అదీ? అని కేకేసింది వాళ్ళమ్మ. జవాబుచెప్పకుండా ఎత్తు పీటేసుకుని, తాళం చెవి తీశాడు. ఒక దారం తెచ్చి దాంతో ఆ తాళంచెవిని తన మొలతాడుకి కట్టేసి ఏమీ ఎరగనట్లు సావిట్లో కూర్చుని నళిని కోసం చూస్తున్నాడు మురళి!

మురళి చెవికోసుకుంటాడని విని స్నేహితులంతా తయారయ్యారు చూడ్డానికి.

ఇంతట్లోకీ నళినికూడా మాంచి పదునైన కత్తి తీసుకుని వచ్చాడు.

నెత్తురొస్తే కడిగి కట్టుకట్టడానికని నీళ్లూ, తడిగుడ్డలూ సిద్ధంగా పెట్టారు.

"ఇంక ఇమ్మంటావురా కత్తి?"


"ఊఁ, ఇయ్యి"

"ఇంద, జాగ్రత్తగా పట్టుకో" అని కత్తియిచ్చాడు నళిని.

"ఇదిగో అంతా చూడండి చెవికోసేసుకుంటున్నా" అని చెప్పి నెమ్మదిగా మొలతాడు పైకితీసి జాగ్రత్తగా కత్తితో మొలతాడుకి కట్టివున్న తాళం చెవి కోసేసుకున్నాడు" మురళి!

# కొత్త ఆట నేర్చుకో

బాలా ! వేసంగిసెలవు లొస్తున్నాయి. నీవు ఆడుకుందుకు ఇదిగో సరికొత్త ఆట.




ఈ ఆట ఆడాలంటే ఈ బొమ్మలో లాగ అట్ట తో ఒక పెట్టెను తయారు చేయాలి. ఒక పెద్ద, దళసరి అట్టను తేవాలి. పొడుగు 78 అంగుళాలు, వెడల్పు 30 అంగుళాలు వుండాలి. పొడుగులో 18 అంగుళాలు దగ్గర ఒక మడత, ఇంకో 18 అంగుళాలదగ్గర ఒకమడత, తరువాత 24 అంగుళాలదగ్గర ఒక మడతపెట్టండి. 24 అంగుళాల భాగంలో ఈ బొమ్మలోలాగ గుండ్రపు కన్నాలు ఆరు చేయండి. కన్నాలు 4 అంగుళాలు విరివిగా వుండాలి. తరువాత ఆ అట్టను ఈ బొమ్మలో లాగ మడతపెట్టి కుట్టండి. పెట్టె తయారు అవుతుంది.

ఆరు అంగులాళ పొడవు, మూడు అంగుళాలు వెడల్పు గల గుడ్డముక్కను మధ్యకు మడతపెట్టి చిన్న సంచీగా కుట్టండి. ఆ సంచీలో చింతపిక్కలైనా, చిక్కుడు గింజలైనా నింపి, సంచి నాలుగువైపులా కుట్టండి.

అట్టపెట్టెలో గుండ్రంగావున్న కన్నాల దిగువున అంకెలు వున్నాయి. అట్టపెట్టెకు దూరంగా నిలబడి సంచీని ఒక్కొక్కరు ఆకన్నంలోనికి విసరాలి. ఏ కన్నంలో సంచీ దూరిపడితే ఆ విసిరిన వారికి అన్ని మార్కులు. ఎవరికి ముందుగా 500 మార్కులు వస్తే వాళ్లు గెలిచినట్టు.

# తాతయ్య సలహాలు

ఎప్పటి కప్పుడే మిమ్మల్నందరినీ 'బాల' ద్వారా కలుసుకుందా మనుకోడం ఆలస్యమయిపోడం జరిగిపోయింది.

నేను ముసలాడినయినా మీ అందరిలాగే 'బాల' పత్రిక వచ్చేసరికి, నా మనుమలతో దెబ్బలాడి, బాలను నేనే ముందు చదువుతాను. "ముసలాళ్లు మీరు మరీని, పిల్లలకంటెనా మీరు" అని అవ్వ కోప్పడుతూ వుంటుంది. ఊహూఁ. వినిపించుకుంటేనా.



'బాల'లో మీరందరూ రాస్తున్న పాటలూ, పద్యాలూ, కథలూ, నాటకాలూ అన్నీకూడా శ్రద్ధగా నా సులోచనా లెట్టుకుని చదువుకుని ఎంతో సంతోషిస్తుంటాను.

మీ పరీక్షలు దగ్గిరకొస్తున్నాయికదూ. బాగా చదువుతున్నారా? ఆరోగ్యం చెడేలాగ రాత్రిళ్లు చాలాసేపు "టీ" అవీ త్రాగి మేలుకోకండి. తెల్లవారుజామున లేచి చదువుకుంటే చదివింది మనసుకి బాగా పడుతుంది. నేను చిన్నప్పుడు అలాగే చదువుకున్నా.

పరీక్షల సమయంలో మీకో సలహా — పరీక్షలంటే ఖంగారుపడేవారు మీలో కొందరుంటారు. పరీక్షలకి బాగా చదువుతారు. విషయం బాగా తెలిసేవుంటుంది. ఏప్రశ్న వేసినా యింటిదగ్గిర కలాయించి జవాబు చెప్పేస్తారు. కాని పరీక్షహాల్లోకి వెళ్లేసరికి మీలో కొంతమందికి, భయం పుడుతుంది. పరీక్షకి వెళ్లేప్పుడు ఎటువంటి ఖంగారు భయమూ లేకుండా, ప్రశాంతంగా, మనస్సులోటి నవ్వుతూ పేలుతూ వెడితే పరీక్షలు బాగా రాయగలుగుతారు.

ప్రశ్నలు శాంతంగా చదివితే బాగా అర్థంఅవుతాయి. అప్పుడు జవాబులుకూడా బాగా రాస్తారు.

సంవత్సరాది పండక్కి మీరందరూ కొత్తబట్టలూ అవీ కుట్టించుకున్నారా?

కొత్తసంవత్సరంలో మీకందరికీ జయంకలిగి, ఆయురారోగ్యంతో వుండాలని మీ ముసలితాత దీవిస్తున్నాడు.

# చెప్పండి!

మా క్లాసులోవున్న పిల్లలందరికంటే చాలా మొద్దుఘటం నేనే! అయినా ప్రతిపరీక్షలోను నేను మా క్లాసులో మూడోవాణ్ణి!

బాలా! ఎందుకో తెలుసునా?

డి. రామారావు, ఆదోని.


బీటాలాక్స్




చాక్లెట్ భేదిబిళ్లలు

సుఖవిరేచ నౌషధము

ఇవి చాక్లెట్ భేదిబిళ్లలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

పొట్లం **2** బిళ్లలు **1** అణా.

అన్నిచోట్ల దొరకును.

తయారుచేయువారు:

**BOMBAY TABLET MANUFACTURING CO.,**
**Post Box No. 2092, BOMBAY. 2.**

## బాల బహుమానాలు

ప్రతీనెలా "బాల" చందాదారుల నెంబర్లు లాటరీతీసి, పదిమంది చందా దారులకు 1 రూ. చొప్పున బహుమానం పంపుతున్నాము. ఈ నెల లాటరీలో యీ దిగువ చందాదారులకు బహుమానములు వచ్చాయి.

—మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| C. V. దీక్షితులు, B. A., M. L., మదరాసు | 880 |
| R. A. రామయ్య, M. B., B. S., మచిలీపట్నం | 703 |
| R. S. మూర్తి, హైదరాబాదు | 379 |
| హెడ్మాస్టర్, గవర్నమెంటు సెకెండరీ ట్రెయినింగు స్కూలు, భీమునిపట్నం | 33 |
| సెక్రెటరీ, Boys' Association, తూపల్లె | 88 |
| P. రామారావు, తెనాలి | 523 |
| ధనికొండ సూర్యనారాయణ రావు, నూజవీడు | 323 |
| V. వెంకట రమణమ్మ, పిఠాపురం | 504 |
| గండవేది ధనలక్ష్మమ్మ, మద్రాసు | 1041 |
| K. రాజయ్య. హెడ్మాస్టరు, రామంచ | 225 |


## తల్లీ — పిల్లా

పాపలు
ఎండుగాను
పీలగాను
ఎందుకు వుంటారు?

తల్లులు బలంలేకుండా
జబ్బువారైతే
వారికి పుట్టిన పిల్లలు కూడా
అలాగే వుంటారు.

స్త్రీల జబ్బులకు మంచి
మందు ఏదంటే—

# లోధ్ర


ఈ పేరు అందరూ విన్నదే—
అయినా దీనిని గురించి మీ
అమ్మతో చెప్పండి.

"లోధ్ర" దొరికే చోటు:

**కేసరీ కుటీరము లి.**

రాయపేట - మదరాసు 14.

# పిల్లి బొమ్మ నేర్చుకో!



బాలా! పిల్లిబొమ్మ గీయడం చాలా సులభం నేర్చుకో....


బామ్! బామ్!! బామ్!!!

# "జైహింద్" బామ్

# JAI HIND BALM

బామ్ అంటే భయపడకండి — ఇది బాంబుకాదు

ఈ బామ్ మనకి మేలుచేసే బామ్. తలనొప్పి, గుండెజలుబు, రొంప భారం, గొంతునొప్పి, ఇంకా, మీకు ఆటలలో కలిగే గాయములను, బాధలను పోగొట్టుటలో యాటంబాంబులాగ పనిచేస్తుంది.

## జై హింద్ అండ్ కో

వారిచే తయారు చేయబడినది—మద్రాసు 1.

# ఇలుంగు భాష

రచన: దే. నా. మూర్తి

బాలా! ఇలుంగు భాషఅంటే ఏమిటో నీకు తెలుసా! మనం ఇంగ్లీషు పదములను, తెలుగు పదములను కలిపి, సంధిచేసి మాట్లాడు తుంటాం మే—అదే ఇలుంగుభాష.

మచ్చుకి కొన్నిమాటలు:

బస్సెక్కు (బస్సు + ఎక్కు)

పెన్నేది? (పెన్ + ఏది?)

బుక్కియ్యి (బుక్ + ఇయ్యి)

బెంచెక్కు (బెంచ్ + ఎక్కు)

టైమెంత? (టైమ్ + ఎంత)

ఇటువంటి మాటలు ఎన్ని వాడుతున్నావో! తలచుకో


ENAMEL BOARDS
means
better display
&
better business
PERMANENT
CHARMING
MADRAS ENAMEL WORKS LTD.
65 SYDENHAMS ROAD · · · · MADRAS








లివర్ & స్ప్లీన్ వ్యాధులచే బాధ పడుచు, యితర ఔషధములచే నివారింపబడజాలని శిశువులు వేలకొలది, యీ అద్భుతఔషధరాజముచే రక్షింపబడిరి.

జమ్మి వెంకట-రమణయ్యగారి

లివర్ క్యూర్

జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రఖ్యాతిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలో కెల్ల నొక విజయోత్సవముగా శ్లాఘించుచున్నారు.

అంతటి కెమిస్టుల వద్ద దొరుకును లేనిచో క్రింది విలాసమునకు వ్రాయుడు.

జమ్మి వెంకటరమణయ్య & సన్సు

1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.

ఇంకను: బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగళూరు, తిరుచినాపల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.

# నాణ్యము — ధరలు

బట్టల వ్యాపారములో నాణ్యము - ధరలు ఈరెండూ
ముఖ్యముగా గమనింపవలసిన విషయములు,

మంచి నాణ్యము, సరసమైన ధరలూ కావాలంటే చేనేత బట్టలనే కొనవలెను,



మాచే తయారుచేయబడు చీరెలు, ధోవతులు, తువాళ్లు, షర్టింగులు
మొదలగు వాటిపై ముద్రింపబడిన సరసమైన కంట్రోలు ధరలకు
మీరు కొనినచో మా బట్టల నాణ్యము మీకే తెలియును.

మదరాసులోను, అన్ని జిల్లాలలోనూ వుండే
మా విక్రయశాలలలో దొరకును.

## మద్రాసు హ్యాండ్‌లూమ్ వీవర్స్
## ప్రొవిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లి.

నెం. 6-ఎ. వుడ్సురోడ్ - మౌంటురోడ్, మదరాసు.



# పొడుపుకథలు

## 1

తలలేదు మొలగలదు

ధరణిలో తా గలడు

వెలయ చేతులు గలవు

వేళ్లు లేవు!............ఎవరు?

## 2

జీడి వారి కోడలు

సిరిగలవారి ఆడబొడుచు

వైశ్యులు కులికే వయ్యారి

వైశాఖంలో వస్తాది........ఎవరు?

సంపాదన: వడ్డాది కుసుమకుమారి (పిఠాపురం)

## 3

విత్తనం చిన్నది

విచారం పెద్దది........ఏది?

## 4


ఆకాశాన అంగవస్త్రాలు

ఆరవేశారు............ఏవి?

సంపాదన: ఎ. జె. లక్ష్మీపతి (పాపినాయకనహళ్లి)

(జవాబులు మే సంచికలో)

## ఆలోచన



చి॥ జి. బాలాజి

(కుప్పం)

## బాల వాలంటీరు



చి॥ మాగంటి నాగార్జున


## "మావూరికి వస్తావా?"



చి॥ పల్లెటూరి తులశి"

(4 ఏళ్లు)

## "అమెరికా వెళ్తాను"



చి॥ విజయలక్ష్మి పండిట్

(సికింద్రాబాద్)

# ఉ కా రం

[బడిలో]

ఆనాడు మా బడికి ఇనస్పెక్టరుగారు వచ్చారు. ఇనస్పెక్టరువస్తే మాకంటే మా గురువుగారికి ఎక్కువ భయం, ఎందుకో !

ఆరోజున యీ గమ్మత్తు జరిగింది:

ఇనస్పెక్టరు: అబ్బాయీ! నాలుగు ఉకారములు గల పదము చెప్పగలవా ?

గోపు: రాదండీ

సీను: తెలియదండీ

ఇనస్పెక్టరు: ఏమండీ మేష్టారు గారూ మీరు ఇటువంటి పదాలు కుర్రాళ్ళకి చెప్పలేదేమీ? ఏదీ, ఉదాహరణకి ఒకటి మీరు చెప్పండి.

మేష్టారు: (తెల్లబోయి చూస్తూ వుంటారు.)

అప్పుడు నేనులేచి:

"ఇటువంటి **గురువులు** రాదని తెల్లమొహంవేస్తే మా వంటి **పురుషులు** చెప్పగలరా ?" అన్నాను.

రచన: పంతిన వరహా నరసింహారావు,
(విజయనగరం.)


స్వర్ణోత్సవ - ఆగమనసందర్భంలో




పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతము

50 యేండ్లుగ ప్రజాలోకమునకు అమూల్య సేవచేయుచు, ప్రజల ఆరోగ్యమును పెంపొందించుచు, ఆనంద సంతృప్తులను కల్గించి, ప్రజానురంజకమైనదని వెల్లడించుటకు గర్వించుచున్నాము.

ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్
టి. నగర్... మద్రాసు.

EASTERNS 379.



# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ!

చిట్టి తమ్ముళ్లూ!

మీలో చాలామంది, 'బాల'కూ, నాకూ కొత్త సంవత్సరం జేజేలు పంపారు. చాలా సంతోషం. ఈ సంవత్సరం మీరందరూ పరీక్షలు బాగా ప్యాసై, మీ బాల సంఘాలన్నీ ఇంకా ఇంకా వృద్ధి పొంది, మీ కోరికలన్నీ ఫలించి, మీ కందరికీ జయము కలగాలి.

పరీక్షలు అవడంతోటే మీకు వేసంగి శెలవులిస్తారు. సెలవుల్లో మీరందరూ సరదాగా కాలక్షేపం చేస్తారు. చక్కగా పైవూళ్లకి వెళ్లడం, స్నేహితుల్ని బంధువుల్ని చూడడం, కొత్త ఆటలు, కొత్త పాటలు నేర్చుకోడం, ఇలాగ ఎంతో ఆనందంగా ఉంటారు. కాని మీ ఆనందంలో నన్ను మరచిపోకండేం? మీరు చూసినవీ, మీరు నేర్చుకున్నవీ, అన్నీ, నాకుకూడా చెబుతారు కదూ.

చెల్లాయిలు, తమ్ముళ్లు, ఎన్ని ఉత్తరాలు రాస్తే, నాకు అంత గొప్పపండుగ

## జాబులు - జవాబులు

**K. V. R. కృష్ణ (మచిలీపట్నం)**

తమ్ముడూ, నీ కార్డు అందింది. చిక్కు ప్రశ్నలకు జవాబులు పంపినవారి పేర్లు 'బాల'లో ఎందుకు వేయడం మానేశారని అడిగావు.

ఈ కాగితం కరువు రోజుల్లో పేర్లు మాత్రం వేసి, 2, 3 పేజీలు వృధా చేసేకంటే, ఆ పేజీల్లో తమాషా కధలు, బాల పోటీ రచనలు వేస్తే బాగుంటుందని ఎడిటరుగారు అన్నారు.

**M. S. మూర్తి (యండగండి)**

తమ్ముడూ, నా ఫోటో గురించి మరచిపోలేదులే! వీలుచూసుకుని వేస్తానన్నారు ఎడిటరుగారు. కాని, నేనుకూడా ఫోటో ప్రకటన చార్జి రు. 6/- ఇవ్వాలట!

చిక్కు ప్రశ్నల విషయంలో

K. V. R. కృష్ణకి ఇచ్చిన జవాబే నీకున్నూ.

రామావరుపులనాగరాజరావు (చింతారెడ్డిపాళెం)

తమ్ముడూ! నాపేరు ఏమిటో నీకు తెలుసుకోవాలని వుందా? పేరులో ఏముందీ? అక్క—అక్కే!

M. అంకారావు. రాజమ్మ (బెజవాడ)

మీ కార్డు అందింది. బాల సంఘంలో చేరినందుకు చాల సంతోషం. బాలసంఘ నియమా లన్నీ కొద్దిరోజుల్లో తయారవు తాయి. అయిన వెంటనే మీకు పంపుతాం. అక్క.

## బాల సంఘాలు

బాల స్వరాజ్యసంఘము, మాచవరం, బందరు :

జనవరీ 26 తేదీని స్థాపించాం. కాంగ్రెసు సేవాదళంవారితో కలసి "డ్రిల్లు" చేస్తున్నాం. ఆదివారం ఉదయం పాటలు పాడుతూ గ్రామసంచారం చేస్తున్నాం-బి. మోహన్ దాస్.

హిందూబాల విద్యార్థి సంఘం, వేటపాలెము :

నలభైమంది సభ్యులతో యీ సంఘం ప్రారంభించాం. S. గిరిజాపతి, P. చిన్నయ్యాలు కార్యదర్శులు.

రైల్వే విద్యార్థిసంఘం, పలాసా :

ఈ సంఘం కార్యదర్శి ఎమ్. సీతారాం ఉన్నత చదువుకొరకు మా గ్రామం విడిచి వెళ్ళవలసిన సందర్భములో 21-2-47 తేదీని వీడ్కోలుసభ జరిగింది. సీతారాంగారు మా సంఘమునకు చేసిన సేవనుకొనియాడుతు, వారికి 'తెనుగుతల్లి,' 'జైహింద్' పుస్తకములు బహుమానముగా యియ్యబడెను. అతని స్థానే జి. సూర్యారావుగారు కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

తాడేపల్లిగూడెం బాలసంఘం :


శ్రీ పసల సూర్యచంద్రరావు మొదలగు పెద్దల సహాయముచే యీ సంఘము బాగా పనిచేస్తున్నదని శ్రీ కె. వి. రమణారావు (అధ్యక్షులు) తెలియజేయుచున్నారు.

కనిగిరి తాలూకా టీచర్ల సభ :

ఈ సభ మార్చినెల 8 వ తేదీని కనిగిరిలో జరిగింది. పంతుళ్ల జీతాలు హెచ్చించమని తీర్మానించారు. ఈ సభలో బాల బాలికలు కోలాటం చాలా బాగా వేశారు. గన్నవరం బాలసంఘం హరిజన విద్యార్థులు పాటలుపాడి బహుమతులు పొందారు. చిత్రలేఖనము, చిత్రవేషధారణ, చేతిపనుల పోటీలలోకూడా బహుమతులు పొందారు. -బాలవిలేఖరి.

## పెళ్ళి

ఆయుర్వేదాశ్రమం అధిపతులైన శ్రీ డి. దేశికాచార్లుగారి కుమార్తె చి॥ రాజలక్ష్మిని టుంకూరు శ్రీ ఎస్. శామయంగారి కుమారులు చి॥ రాజన్ గారికి ఇచ్చి మార్చి 9 వ తేదీని త్యాగరాయ నగరములో చాలా గొప్పగా పెళ్ళి జరిగింది. చిట్టిబాలలు, తల్లులు, తండ్రులు, అనేకులు వచ్చి దంపతులకు ఆశీర్వదించారు.




[బాలలు డైరీ రాయడం నేర్చుకోవాలి. డైరీ రాస్తే ఎంతో బాగుంటుంది. మేము ప్రతీ నెలా మదరాసులోని ఒక బాల డైరీ ప్రచురిస్తాం. చదవండి. —సం॥

## మార్చి

తేది.

1. ఇవాళ మా అమ్మమ్మ యీవూరు వచ్చింది.
2. ఇవాళ రేడియో ప్రోగ్రాం ఇంట్లోనుంచే విందాం అని రేడియో స్టేషనుకి వెళ్ళలేదు. తీరా 2–15 ని॥లకు మా రేడియో పెట్టేసరికి అది వాగలేదు! గబ గబ గంటివారింటికి వెళ్ళాను. వెళ్ళేసరికి అప్పుడే "పోదామా - ఇక పోదామా" పాడేస్తున్నారు. ప్రోగ్రాం వినలేదని నాకు ఏడుపు వచ్చింది. ఛీ! ఈరోజు ఏమీ బాగులేదు.
3. నా కలం పాళీ విరిగి పోయింది. కొత్త పాళీ కొనుకున్నాను.
4. ఈరోజున మేం "జూ" చూడ్డానికి వెళ్ళేం. అక్కడ ఎన్నో జంతువుల్ని చూశాం.
5. మా బడిలో యీ రోజున ఆట పోటీలు. జరిగాయి సీత మాజట్టులో కలుస్తానంది నేను ఒప్పుకోలేదు. దానికి కోపం వచ్చింది.
6. నేను చదువుకుంటూంటే జెర్రి వచ్చింది. అన్నయ్య చంపేశాడు. లక్ష్మీవారంనాడు జెర్రిని చంపకూడదని మా అమ్మ చెప్పింది.
7. ఈరోజున సంగతులేమీ లేవు.
8. మా మోతీ (కుక్కపిల్ల) ఊరికే అరవడం మొదలెట్టింది. నాన్నగారికి కోపం వచ్చి ఆ కుక్కని ఎవరికేనా ఇచ్చేమన్నారు.
9. రేడియో ప్రోగ్రాంకి ఇవాళ తాతయ్య బలే గమ్మత్తుగా కథ చెప్పాడు.
10. ఉగాది పండుగకి కొత్తబట్టలు మా అమ్మ కుట్టిస్తానని చెప్పింది.
11. మా అన్నయ్య ఒక చాకు కొన్నాడు. ఆ చాకు కొన గుండుసూదికి చూపిస్తే అది దానికి అంటుకుంది! దానినే ఆకర్షణశక్తి అంటారుట.
12. ఇవాళ మా అమ్మ పరికిణీ గుడ్డలు, జాకెట్టుగుడ్డలు కొన్నాది. ఎర్రపువ్వుల పరికిణీ నాది.

13. ఇవాళ "బాల" లోని కథలన్నీ చదివాను. అమ్మమ్మకూడా కథలు చెప్పింది.

14. బడికి ఆలశ్యంగా వెళ్ళానని మేస్టారు కోప్పడ్డారు.

15. దర్జీవాడు ఇంకా మా బట్టలు కుట్టలేదు. ఉగాదినాటికి ఇస్తాడో ఇవ్వడో!

16. ఇవాళ రేడియోకి వెళ్ళాను.

17. ఈరోజు మా బడికి సెలవు. ఇంట్లోనే చదువుకున్నాను.

18. ఇవాళ మామయ్య మా అమ్మమ్మకి మనియార్డరు పంపించాడు. అమ్మమ్మ నాకో రూపాయి ఇచ్చింది.

19. దర్జీవాడు ఇంకా బట్టలు కుట్టలేదు. రేపు సాయంత్రం ఇస్తాడట.

20. ఇవాళ మా బడిలో ఒక కొత్త సంగతి విన్నాను. నూటా ఎనిమిది తెల్లగుర్రాలు చూచి, తరువాత ఒక కాగితంమీద 108 అంకెవేసి ఆ కాగితాన్ని ఒక చెట్టు తొఱ్ఱలో దాచివుంచాలి. ఆలాచేసినవారికి ఏదో వెండి వస్తువ బహుమానంగా దొరుకుతుందట! నేను ఇవాళ అప్పుడే 3 తెల్ల గుఱ్ఱాలు చూశాను.

21. ఇవాళటికి నేను 14 తెల్ల గుఱ్ఱాలు చూశాను. సావిత్రి అప్పుడే 31 గుఱ్ఱాలు చూశిందట.

22. దర్జీవాడి కొట్టుకి వెళ్ళి అల్లరిచేస్తే ఇవాళ మా కొత్తబట్టలు ఇచ్చాడు. రామం చొక్కా ఇరుకుగా కుట్టాడు.

23. ఈరోజు ఉగాది పండగ. పొద్దున్నే రేడియో అక్కయ్యతో రేడియో కెళ్ళి స్వాగతం పాటలు పాడాను. మధ్యాహ్నం పిల్లల ప్రోగ్రాం బలే తమాషాగా వుంది. రేడియో తాత, పొట్టిబావ, మొద్దబ్బాయి, జిలేబీ, మిరపకాయ - అందరూ 150 మంది పిల్లలు వచ్చారు. చాలా సరదాగా వుంది.

24. నిన్న సాయంత్రం అమ్మమ్మకి ఫోటో తీయించారు. అమ్మమ్మ వొళ్ళో నేను కూర్చున్నాను.

25. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఈరోజు నుంచీ బాగా చదవాలి.

26. ఈరోజు హిస్టరీ, తెలుగు చదివాను.

27. "బాల"కి మా నాన్నగారు యీరోజునే రూ. 5/- లు చందా కట్టారు.

28. ఇవాళ సైన్సు, జాగ్రఫీ చదివాను.

29. సీత మాఇంటి కొచ్చింది. ఇద్దరం కలిసి లెక్కలు చేస్తున్నాం.

31. ఈరోజు శ్రీరామనవమి. మా అన్నయ్య పుట్టింరోజు కూడాను. మా ఇంట్లో పండుగ చేశారు.

---

## రచయితలకు మనవి:

మీరు పంపిన రచనలు తిరిగి పంపుటకు వీలుపడదు. అందుచేత మీ రచన ఒక కాపీ మీవద్ద ఉంచుకొని, మరొక కాపీ మాకు పంపండి. పోస్టుబిళ్లలు అనవుసరముగా పంపవలదు. రచనలు బాగుంటే మేమే వేస్తాం. సం॥

# పోటీ రచనలు

[ఫిబ్రవరి నెలలో "బాల" పోటీ పరీక్షలో బహుమతి పొందినవారి రచనలు ఈ దిగువ ప్రచురిస్తున్నాం. స్థలం చాలదు గనుక మొదటి రెండు బహుమానాలు పొందినవారి రచనలే వేయగలిగాం — పోటీ సం॥]

## I

మొదటి బహుమానం రూ. 10 పొందిన

### చి॥ వల్లూరి సావిత్రి (మదరాసు) రచన:

"బాల" పత్రిక నా కెందుకు ఇష్టమో చెప్పాలంటే చాల సులువయినపనే. ఎందుకంటే, 'బాల'లో వేస్తున్నవన్నీ మాకు ఇష్టమైనవే గనుక!

కథలూ, కబుర్లూ, వింతలూ, విశేషాలూ, ఆరోగ్యసూచనలు, బొమ్మల పద్యాలు, పాటలు చిక్కుప్రశ్నలు, అబ్బబ్బ! యీ పత్రిక చదువుతూవుంటే ఎంతో ఉత్సాహంగా వుంటుంది. రోజంతా స్కూలు పాఠాలే చదవాలంటే విసుగు పుట్టుతుంది; కుదురూ వుండదు.

కొంతమంది పిల్లలకి బడిలో గురువుగారు ఎంత బోధించినా అర్థమేకావు. "బాల" లోని బొమ్మల పద్యాలు చూడండీ ఎంత బాగా అర్థమవుతాయో!

ఆటలంటే అందరికి ఎంతో ఇష్టం. కానీ ఎప్పుడూ ఒకేఆట ఆడాలంటే ఎవరికైనా విసుగే. "బాల" నెలకో కొత్త ఆట చొప్పున ఏదోఒక ఆట చెప్తూనే ఉంది. పోయిన నెలచెప్పిన "పోస్టు బంట్రోతు" ఆటంటే నాకెంతో ఇష్టం.

"బాల" రాకముందు మాకేమీ తోచేదికాదు. పెద్దవాళ్లు ఏభారతో; ఆనందవాణో చదువుతూవుంటే మాక్కూడా చదవాలనిపించేది. కాని మాకేమి అర్థం అయేదికాదు. మేం ఏదైనా చిన్న కథఅయినా, పాటఅయినా రాస్తే మాది ఏపుస్తకంలో వేస్తారు? "బాల" పత్రిక ఎప్పుడు వచ్చిందో అప్పటినుంచి కథలు వ్రాయడమన్నా, చిన్న చిన్న చిక్కు ప్రశ్నలు వేద్దామన్నా

చాలా కుతూహలం, ఉత్సాహం పుట్టింది. ఎందుకో తెలుసా? "బాల" కీ మమ్మల్నంటే ఇష్టం. మాకూ "బాల" అంటే ఇష్టం.

"బాల" మాచేత సంఘాలు పెట్టించి ధైర్యం తెప్పించింది. పిల్లల ఫోటోలుగానీ వాళ్ళని గురించిగానీ ఏ పుస్తకంలోను కనబడేవి కావు. ఈ పుస్తకంలో మంచిపేరు తెచ్చుకొన్న పిల్లల గురించి వేసి వాళ్ళ ఫోటోలు వేసి మిగతా పిల్లలందరికీకూడా అలా పేరు తెచ్చుకుందామనే కోరిక పుట్టిస్తోంది.

మా అమ్మ కాలంలో అయితే అమ్మమ్మలు చక్కగా కథలు చెప్పేవారు. కానీ కాలం మారి పోవటంచేత, అమ్మమ్మల్ని కథలు చెప్పమంటే కథలే రావంటారు. "బాల" ఉండడంచేత మాకీ కొరత తెలియటంలేదు. అమ్మమ్మకంటే, 'బాల' ఎంతచిన్నదో అన్ని కథలు చెప్తుంది.

నాకు సినిమాలన్నా, నాటకాలన్నా మరీఇష్టం. కొన్ని కొన్ని సినీమాలు నాకు అర్థమయేవే కావు. "బాల" నాకంటే ముందుగానే సినీమాచూసి, సినీమాల్లో వేసిన చిన్నపిల్లల గురించి చక్కగా చెప్తుంది.

బాలలో ఎన్నో అంకెల తమాషాలు, గారడీలు కూడా ఉంటాయి. ఇవన్నీ నేను స్కూలుకెళ్ళి చేసి చూపించానంటే పిల్లలందరు ఎంతో ఆనందంతో, ఇంటికెళ్ళి వాళ్ళ నాన్నకి, అమ్మకి చెల్లాయికి, తమ్ముడికి చూపిస్తారు. వాళ్లు సంతోషిస్తారు.

'బాల' పొడుపు కథలుకూడా చెప్తుంది. ఈ పొడుపు కథలకి జవాబులు మా బావని అడుగుతూ ఉంటాను.

ఈ పుస్తకంలో జేజిమామయ్య పాటలు ఉంటాయి. మా పాపకి ఈపాటలంటే ఎంతో ఇష్టం. బాల దగ్గరనుంచే నేను చూడని కొత్త జంతువుల గురించి, వింత జంతువుల గురించి నేర్చుకున్నా. అందులో మేకులుతినేపక్షి మరీ వింతగా ఉంది!

"బాల"కి ముగ్గులుకూడా ఎన్నోవచ్చు. ముగ్గుతో రథం వెయ్యడం, తులసికోట వెయ్యడం బాగా వచ్చు. అవి ఎంతో బాగుంటాయి.

ఈ పత్రికలోనే హిందూ దేశంలో చూడవలసిన ముఖ్యమైన దేశాలు, నగరములు ఆయా దేశాల్లో చూడవలసిన ముఖ్యమైన వింతలూ, తమాషాలు అన్నీ ఉంటాయి. ఈ ముఖ్యమైన వాటిని నేను గుర్తుఉంచుకొని నేనువెళ్ళినప్పుడు అన్నీచూస్తాను.

ఒకరోజున మా పాపాయి ఉన్నట్టే ఉండి ఏడుపు మొదలు పెట్టింది. మా అమ్మకి ఏమీ తోచలేదు. మా తమ్ముడు అప్పుడే 'బాల' చదువుతూ 'అమ్మా 'గ్రైప్ కాల్' ఇస్తే పిల్లలు ఏడుపు మానార్తరని ఈపుస్తకంలో ఉందే' అన్నాడు. మా అమ్మ ఆ తియ్యమందు 'బాల' లో అడ్రసుచూసి తెప్పించింది. అది ఇస్తే పాప వెంటనే ఏడుపు మానింది. చూశారా, మా తమ్ముడు కూడా ఎంత గొప్ప వైద్యుడయ్యాడో ఈ పుస్తకం చదవటంవల్ల! ఈ పుస్తకంలోనే ఇంగువ, బిస్కట్లు, చేనేతబట్టలు ఇవన్నీ ఎక్కడ దొరుకుతాయో వేశారు.

'బాల' ఎంతో తెలివైనది, చక్కనిది, మనోహరమైనది, చురుకుతనం చెప్పనే అక్కరలేదు. ఎన్నో ఆటలూ, పాటలు, కబుర్లూ, వింతలూ, తమాషాలు ఇంకా ఎన్నోవచ్చు. ఇవన్నీ నాకు చెప్తుంది. అందుకే 'బాల'పత్రిక అంటే నాకెంతో ఇష్టం.

## II

రెండవ బహుమానం రూ. 6 పొందిన

**చి॥ బొడ్డు శేషయ్య (ధేనువకొండ) రచన :**

బహు సంతోషం - బాలంటేను
బాలల్లారా - బాగా వినుడీ
బాల చదివితే - బాగుపడెదము
పరాకులేక - పఠించండి
ప్రతిమాసంబున - బయలుదేరును
చిత్రములగు బహు - చిత్రంబులతో

పొడుపు కథలతో - పొడనూపునుగా
గొలుసు మాటలతో - గూఢదారులతొ

బాలలకవసర - మగుప్రకటనలతో
కొంటె కృష్ణుని - కోతిచేష్టలతొ
చిక్క బొమ్మల - చిత్రంబులతో
లెక్కల నేర్పెడు - నిక్కపు మతితో

తిరుగుడు డొంకల - తికమకమకలతో
మరపురాని బహు - మరియాదలతో
వింత కథలతో - విజ్ఞానముతో
సంతస మొసగెడి - సంగీతముతో

బొమ్మల వ్రాసెడు - పొందిక నేర్పును
అంకెలలోగల - వంకర తెలుపును
నీతిమార్గముల - నెన్నో నేర్పును
భావిపౌరులుగ - బాలలజేయును

ఆరణాలెగద - అందుబాటుగద
బారలుచాచెడి - బాలలందరకు
ఎన్నో విషయాల్ - కన్నులగట్టిన
రీతిగాంచనగు - ప్రీతిగ మనము.

మంచి అచ్చుమరి - మంచికాగితము
కొంచెము కొంచెము - కానివ్రాతలు
మాస మాసముకు - బహుమానంబులు
ఆసగూర్చు మన - కందరకున్

ఈనెల బహుమతి - నేనేతగితే
ఈర్ష్యనొందకుడు - మీరంతా
రాగల పోటికి - వ్రాసి బాగుగా
బాలలు పొందుడి - బహుమానం.



# బాలపోటీ—
# —గెలిచినవారు

★

[మార్చినెల బాల పోటీపరీక్షలోకూడా చాలా మంది గమ్మత్తులు పంపారు. కొందరు తెలియక కథలు పంపారు. ఈ దిగువవారు పంపిన గమ్మత్తులు చాలా బాగున్నాయి కాబట్టి వారికి బహుమతులు పంపబడును—సం॥]

మొదటి బహుమానం (రూ. 10/-)

చి॥ ఆదిరాజు సరళ (అప్పికట్ల)

రెండవ బహుమానం (రూ. 6/-)

చి॥ పిరాట్ల అచ్యుత రాధాకృష్ణ (కాకినాడ)

మూడవ బహుమానం (రూ. 4/-) (ఇద్దరికి చెరిసగం)

చి॥ Ch. క్రిష్ణవేణి (మద్రాసు)

చి॥ అరిగెల వెంకట కృష్ణారావు (మాచవరము)

ఇవిగాక ఈ దిగువవారు పంపిన గమ్మత్తులు కూడా బాగున్నాయి. వారికి ఈ నెల "బాల" ఉచితముగా పంపబడును.

1. చి॥ ఇమ్మానేని ఆషారాణి (బాపట్ల)
2. ,, నిష్టల వెంకటరమణమూర్తి (మద్రాసు)
3. ,, ని॥ కోమల (విజయనగరం)
4. ,, తాళ్లూరి వెంకట నరసింహారావు (ఏలూరు)

(గెలిచినవారి రచనలు మే సంచికలో ప్రచురిస్తాం—పోటీ సం॥)

# "బాల" పోటీ పరీక్ష

ఏప్రిల్ నెల

మొదటి బహుమానం రూ. **10**
రెండవ బహుమానం రూ. **6**
మూడవ బహుమానం రూ. **4**

పిల్లలకు గొప్ప అవకాశం! ఉత్సాహం! ఆనందం!

ఈనెల పోటీ ప్రశ్న ఇది :

## "మా అమ్మమ్మ"

మీ అమ్మమ్మనిగురించి ఒక చిన్నరచన, రెండు పేజీలకు మించకుండా (పావుఠావు సైజులో) రాయవలెను. నీవు బాగా రాస్తే నీకు యీ పై మూడు బహుమానాలలో ఒకటి రావచ్చును.

మీ రచనతో **4** అణాలు పంపండి

- నాలుగణాలు మనియార్డరుగాగాని, నాలుగు అణాబిళ్లలుగాగాని పంపండి. పావలా బిళ్లలు పంపవద్దు.
- ఈ పోటీలో 15 ఏళ్లకు లోపువారే చేరాలి.
- కవరుమీద "బాల పోటీ" అని పెద్ద అక్షరాలతో రాయాలి.
- మీ రచనలు మాకు ఏప్రిల్ 25 వ తేదీ లోపుగా చేరాలి.

ఈ పోటీలో 'బాల' ఎడిటర్‌గారి అభిప్రాయమే ఖాయము.

ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

---


పై విలాసం ఇలా రాయండి :

"బాల పోటీ పరీక్ష"

c/o "బాల", 3, తంబుచెట్టి వీధి, మదరాసు 1.

## ఇద్దరూ ఒకరే!





చి॥ చౌడవరపు సీతారాజ్యలక్ష్మి (జగ్గయ్యపేట)

★  ★

మహతీవారి "లక్ష్మమ్మ" లో నటిస్తున్న "సులోచన"



# ఇది చెప్పుకో చూద్దాం???

I

"అత్తాకోడలి అంచు, పంచపాళీ చుంచు
తోకతెగిన నక్క, బావ పెళ్లి చొక్కా"

(ఈ పాటలోగల మాటలనే ఉపయోగించి వేరువేరు మాటలను చేయగలరా?
ఉదాహరణ: నక్క-బావ.

రచన: కవికొండల వేంకటరావు, (రాజమండ్రి)

II

మర్కటనామ సంవత్సరము అనగా నేమి?
దారి తల మాసము అనగా నేమి?

రచన: వేలూరి వెంకటరెడ్డి, (కనిగిరి.)

(జవాబులు మేనెల "బాల" లో వేస్తాం; చూడండి.)

ఆయుర్వేద వైద్య నిలయం వారి

"లుకోరియా క్యూర్"

స్త్రీ గర్భాశయ సంబంధమైన సమస్త వ్యాధులను నిర్మూలించుటలో నిధియని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. దీనిని సేవించిన పూర్ణారోగ్యము గలిగి వంధ్యత్వము తొలగిపోవును. అనేకమంది దీర్ఘ రోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేదౌషధ రాజము.

90 మాత్రల ప్యాకిట్టు రూ. 2—8—0


ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము:

అన్ని మందులషాపులలో దొరకును.

(మా చిరునామాలో మార్పును గమనించుడు)

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట : : మచిలీపట్టణము.



# ఆలిండియా రేడియో

## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]

[ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

## ఏప్రిల్

**13-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచి; కాకులలో కోకిల - నాటిక; పుట్టినరోజులు; కోకిల - పాట; చిక్కు-ప్రశ్న; పోదామా.

**20-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచి; విసనకర్ర - కథ నాటిక; పుట్టిరోనజులు; తాతయ్య చలివేంద్రం - రూపకం; గొలుసుమాట; పిల్లలపాటలు, కథలు; పోదామా.

**27-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచి; పెంకి పిల్లవాడు - నాటిక; పుట్టిన రోజులు; ఇవి ఏమిటి; గ్రహణాలు; వైశాఖ పూజ - రూపకం; చిక్కు-ప్రశ్న; పోదామా.

## మే

**4వ-తేది ఆదివారం:**

పిలుపుపాట; ఉత్తరాల సంచి; పట్నపు తెనుగు—నాటిక; పుట్టిన రోజులు; బుడంకాయ - కథ రూపకం; చిక్కు-ప్రశ్న; మీ పాటలు, కథలు; పోదామా.

## మార్చి బాల ప్రశ్నలకు జవాబులు

మార్చి "బాల" లోని పొడుపు కథలకు జవాబులు:

1. రోకలిబండ, 2. చేప, 3. గులాబీ, 4. కాకరకాయ.

గొట్టె బండి జవాబు: బట్టె. త జవాబు: లలిత.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St., G. T. Madras.




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము


ఏప్రిల్
10
విడుదల
వాహినీవారి
యోగి
వేమన
నాగయ్య, లింగమూర్తి, రామిరెడ్డి.
రాజమ్మ, పార్వతీబాయి, కాంతామణి
డైరెక్టరు - కే. వి. రెడ్డి B.Sc.(Hons)
STUDIO-NEWTONE